హైదరాబాద్ వార్త

# నేడు అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి గడ్కరీ

## సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయకుండా ఎలా ప్రారంభిస్తారు? ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త**

అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు. అంబర్ పేట ముకరం హోటల్-గోల్నాక చర్చి వరకు 1.6 కిలోమీటర్ల పొడవు, నాలుగు లేన్లతో రూ.415 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఇందులో భూనిర్వాసితుల కోసం జీహెచ్ఎంసీ నిధులు రూ.192 కోట్లు ఉండగా దాదాపు రూ.265 కోట్ల నిధులు నేషనల్ హైవే అథారిటీ వెచ్చించింది. దీనిపై ఇప్పటికే రాకపోకలు సాగుతుండగా సోమవారం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి తదితరులు అధికారికంగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గోల్నాక క్యాంప్ క్యారాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. ఇంకా ఆరుచోట్ల భూసేకరణ చేయలేదు. ఫ్లైఓవర్ ఇరువైపుల సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయలేదు ఫ్లైఓవర్ ఎలా ప్రారంభిస్తారంటూ స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మండిపడ్డారు. పక్కా ప్రణాళిక లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టడం వల్ల ఇప్పటికే అంబర్‌పేట ప్రజలు ప్రతీ రోజూ నరకం అనుభవిస్తున్నారని అన్నారు. కనీసం సర్వీసు రోడ్డు వేయకుండానే ఫ్లైఓవర్‌ను అధికారికంగా ఎలా ప్రారంభిస్తారని ఆయన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ ఫ్లైఓవర్‌కు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ భూసేకరణలో జాప్యం, మతపరమైన నిర్మాణాల అడ్డంకి తదితర సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పక్కా ప్రణాళికతో అధికారులు ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రోడ్డు దాటేందుకు విద్యార్థులు, సర్వీస్ రోడ్డు లేకపోవడంతో వాహనదారులకు దారులులేక చుట్టూ కిలోమీటర్ల కొద్ది తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ కింద మూడు ఫీట్ల ఎత్తులో రోడ్డు వేయడం వల్ల వర్షపునీటితో ఇరు వైపుల ఉన్న బస్తీలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గోల్నాక డివిజన్ చర్చి వద్ద నుంచి ఏర్పాటు చేయడంతో ఎడమ వైపు నుంచి కుడి వైపునకు ప్రతి రోజు వెళ్లే వేలాది మంది విద్యార్థులు, స్థానికవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. చిన్నపాటి వర్షం కురిసినా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు బుర్జుగల్లీ, దోబిగల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో ముంపు సమస్య ఏర్పడుతోందని తెలిపారు. ఫ్లైఓవర్ వల్ల ఇన్నీ సమస్యలూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలియదా అంటూ ఆయన నిలదీశారు. కిషన్‌రెడ్డికి అంబర్‌పేటవాసుల ఓట్లు కావాలి, ఆయన ఎంపిగా గెలుపుకు మోజార్టీ కావాలి. ఆయనకు అభివృద్ధి మాత్రం పట్టడం లేదని ఆయన ఆరోపించారు. ఈ ఫ్లైఓవర్ వల్ల అంబర్‌పేట వాసులకు ఉపయోగం అంతగా ఉండకుండా నిర్మాణం చేశారని, ఈ బ్రిడ్జి వల్ల హైదరాబాద్-వరంగల్ వెళ్లేవారికి ఎక్కువ ఉపయోగమన్నారు. అంబర్‌పేట నుండి కాచిగూడ కమేళా వరకు ఫ్లైఓవర్ నిర్మిస్తే ఉపయోగం ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్లు, వర్షపు నీటిపైప్‌లైన్ల పనులు, గ్రీనరీ అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు పూర్తి చేసిన తర్వాతే ఫ్లై ఓవర్‌ను అధికారికంగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ డిమాండ్ చేశారు. సమావేశంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు.

# ఓల్డ్‌సిటీ మెట్రో పనులు వేగవంతం

◆ అదనపు నిధులు విడుదల చేస్తామని వెల్లడి ◆ మెట్రో విస్తరణ పనులను పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
◆ అవరోధాలు అధిగమించి ముందుకు వెళ్తున్నామన్న మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి



ఓల్డ్‌సిటీలో మెట్రో విస్తరణ పనులను పరిశీలిస్తున్న రామకృష్ణారావు, ఎన్‌విఎస్ రెడ్డి తదతరులు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:**

పాతబస్తీలో కొనసాగుతున్న మెట్రో విస్తరణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు స్వయంగా పరిశీలించారు. ఆదివారం మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డితో కలిసి పాత నగరంలో మెట్రో కారిడార్‌ను సందర్శించారు. మెట్రోరైల్ మార్గంలో త్వరితగతిన జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. గత దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన పాతనగర మెట్రో రైలు మార్గంలో ఇప్పుడు జరుగుతున్న పనుల తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంజీబీఎస్ నుండి చంద్రాయణ గుట్ట వరకు 7.5 కిలోమీటర్ల నిడివిగల ఈ మెట్రో కారిడార్‌లో ప్రభావిత ఆస్తుల కూల్చివేతలను మెట్రో ఎండీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. దారుల్‌షిఫా నుంచి ప్రారంభించి మండీ రోడ్, శాలిబండ జంక్షన్ మార్గంలో ప్రభావిత కట్టడాల కూల్చివేత పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ మార్గంలో ఇరువైపులా చిక్కుముడులుగా ఉన్న క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్, టీవీ కేబుళ్లను అత్యంత జాగ్రత్తతో తొలగిస్తూ పనులు సాగిస్తున్నామని ఎన్వీఎస్ రెడ్డి ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఇరుకైన రహదారులు ఉండడం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా కూల్చివేత పనులను చేపట్టినట్టు మెట్రో ఎండీ వెల్లడించారు. ఈ మార్గంలో దాదాపు 105 మత, చారిత్రక, ఇతర సున్నిత కట్టడాలు ఉన్నాయని, వాటికి ఏమాత్రం హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభావిత కట్టడాల కూల్చివేతలు జరుపుతున్నామని ఆయన చెప్పారు. పగటిపూట వెనుకభాగంలోఉన్న కట్టడాలను తొలగించి, రాత్రి సమయాల్లో రహదారికి ఆనుకుని ఉన్న ప్రభావిత ఆస్తులను యంత్రాల సాయంతో తొలగిస్తున్నామని వివరించారు. ఇందుకు స్థానికులతో ముందుగానే సంప్రదింపులు జరుపుతున్నామని, వారి సహాయ సహకారాలతోనే ముందుకు సాగుతున్నామని ఆయన సిఎస్‌కు తెలిపారు. ఎదురౌతున్న సమస్యలను చాకచక్యంగా పరిష్కరిస్తూ, సమర్థవంతంగా విస్తరణ పనులను నిర్వహిస్తున్నందుకు మెట్రో ఎండీని, ఇతర అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రశంసించారు. ప్రభావిత ఆస్తులు దగ్గరదగ్గరగా ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సీఎస్ సూచించారు. సురక్షితంగా అక్కడ కూల్చివేతలు, శకలాలు తొలగించే కార్యక్రమం వెంటనే జరగాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. జరుగుతున్న పనుల తీరుతెన్నుల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇంకా వాటిని వేగవంతం చేయడానికి అదనపు నిధులను విడుదల చేస్తామని ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు.

**మెట్రో కొత్త కారిడార్‌ల డిపిఆర్‌లకు త్వరలో ఆమోద ముద్ర**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టుగా మెట్రో రైల్ రెండవ దశ డీపీఆర్‌లు సిద్ధమయ్యాయని, రాబోయే హెచ్ఏఎంఎల్ బోర్డు సమావేశంలో వాటిని పరిశీలించి, ఆమోదిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. వీటిని త్వరలో రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించాక కేంద్రానికి పంపుతామని ఆయన వెల్లడించారు. జేబీఎస్-మేడ్చల్ (24.5 కి.మీ), జేబీఎస్-శామీర్‌పేట(22 కి.మీ) కారిడార్‌లతో పాటు శంషాబాద్-ఫ్యూచర్ సిటీ కొత్త కారిడార్(40 కి.మీ)కి కూడా డీపీఆర్‌లు సిద్ధం అయ్యాయని ఆయన తెలిపారు. మెట్రో ఎండీతో ఈ డీపీఆర్‌ల గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాతనగరం మెట్రో మార్గం పర్యటనలో మున్సిపల్ శాఖ కార్యదర్శి కె.ఇల్లంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ బోర్డ్ ఎండీ అశోక్ రెడ్డి, ఇతర మున్సిపల్, మెట్రో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయండి.. సిఎస్**

మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయండి.. సీఎస్ ఆదేశాలు మూసీ నదిపై రూ. 52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించి నిర్మాణంలో తలెత్తుత్తున్న సమస్యలను పరిష్కరించి త్వరగా అందుబాటులోకి తేవాలని ఆయన అధికారులను సూచించారు. సీఎస్ వెంట జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంగీత కళాకారులకు శ్రీత్యాగరాజస్వామి ఆరాధ్య దైవం

## మంత్రి జూపల్లి కృష్ణారావు



త్యాగరాజస్వామి జయంతి మహోత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త:** శాస్త్రీయ సంగీతాన్ని ఊపిరిగా భావించి అదే ధ్యాస, ఆదే శ్వాసగా ఉన్న సంగీత కళాకారులకు శ్రీత్యాగరాజ స్వామి పూజ్యనీయులని, ఆయనే వారి ఆరాధ్య దేవుడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత సామ్రాజ్యాన్ని వాగ్గేయ కారుడు త్యాగయ్య అధిరోహించడం తెలుగు వారందరికి గర్వకారణమన్నారు. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బి స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన శ్రీత్యాగరాజ స్వామి 258వ జయంతి మహోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. అకాడమీ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన త్యాగరాజ కీర్తనలను బహుళ ప్రాచుర్యం కలి ్పంచడానికి కృషి చేస్తామన్నారు. నేటి యాంత్రిక జీవితంలో యువత ఉరుకులు, పరుగులతో వత్తిడికి గురవుతున్నదని, దీంతో అనారోగ్య సమస్యలతో ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. త్యాగయ్య, అన్నయ్య, రాందాసు కీర్తనలు, నృత్యాలు మానసిక ఉల్లాసానికి, ప్రశాంతతకు చేకూర్చుతాయని మంత్రి చెప్పారు. అకాడమీ ఛైర్ పర్సన్ డా. అలేఖ్య పుంజాల మాట్లాడుతూ ప్రతి ఏడాది త్యాగరాజు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, పద్మశ్రీ డా. శోభారాజ్, పద్మశ్రీ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, హైదరాబాద్ సిస్టర్ హరిప్రియ పాల్గొన్నారు. అనంతరం ఆనేక మంది త్యాగరాజ కీర్తనలు గానం చేసి అలరించారు.

# అందాల పోటీల సందడి షురూ..!

## 10 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు.. భాగ్యనగరానికి చేరుకుంటున్న అందగత్తెలు



ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అందగత్తెలకు నుదుట బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న దృశ్యం

**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త :** 'రావమ్మా ముద్దుగుమ్మ.. భాగ్యనగరం మీకు స్వాగతం పలుకుతోంది..నుదుటు కుంకుమ బొట్టుపెట్టి సంప్రదాయ బద్ధంగా పిలుస్తోంది..హారతి పట్టి ఆహ్వానం పలుకుతోంది..అందాల పోటీల్లో మీరే మొదటి స్థానంలో నిలవాలని కోరుకుంటోంది..ఇలా మీ రాకమాకెంతో సంతోషమంటోంది హైదరాబాద్..ఇలా భాగ్యనగరంలో అందాల పోటీల హడావుడి నెలకొంది. తెలంగాణలో అందాల పోటీల హడావుడి ప్రారంభమైంది.. మిస్ వరల్డ్ పోటీల కోసం హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందగత్తెలు పాల్గొనున్న ఈ వేడుకకు భాగ్యనగరం వేదిక కావడం పట్ల నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలతో నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది. పలు దేశాల అందగత్తెలు హైదరాబాద్ నగరానికి చేరుకుంటున్నారు. వారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలుకుతున్నారు. కెనడా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మిస్ కెనడా క్యాథరన్ మోరిసన్‌కు ఘనస్వాగతం లభించింది. యువతులు సంప్రదాయ నృత్యాలు చేస్తుండగా.. తెలంగాణ సంప్రదాయం ప్రకారం హారతిపట్టి, నుదుట బొట్టుపెట్టి, మెడలో పూలమాల వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమెను ఆతిథ్యం ఇచ్చే హోటల్‌కు తీసుకువెళ్లారు. హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు ఇలా..ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగనున్నాయి. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. 150 పైగా దేశాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఇప్పటికే మిస్‌వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్ మిస్ జూలియా ఎవెలిన్ మోర్లీ, మిస్‌వరల్డ్ ప్రతినిధి మిస్ క్రెరి హైదరాబాద్ చేరుకున్నారు.

**13న హెరిటేజ్ వాక్..**

మరో వైపు ఈనెల 13న మిస్ వరల్డ్ పోటీదారులు చార్మినార్ దగ్గర హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఇందుకోసం మదీనా, పత్తర్‌గట్టి, గుల్జర్ హౌస్, చార్మినార్, లాడ్ బజార్ గాజుల మార్కెట్ నుంచి చౌమొహల్లా ప్యాలెస్ వరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో షాపులకు కూడా మెరుగులు దిద్దుతున్నారు.

# మాతృభాష తెలుగును కాపాడుకోవాలి

## మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల పూర్వ గవర్నర్ విద్యాసాగర్‌రావు

**నాంపల్లి, మే 4 ప్రభాతవార్త :**

మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత మొత్తం తెలుగుజాతిపై ఉందని మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల పూర్వగవర్నరు సిహెచ్.విద్యాసాగర్ రావు అన్నారు. ప్రపంచంలో ఏదేశంలోనైనా ఒకస్థాయి వరకు మాతృభాషలో విద్యాభ్యాసం చేయడం ద్వారా మేధావుల్ని, సమాజానికి ఉత్తమపౌరుల్ని అందించిన ఆనవాళ్లు ఎన్నో ఉన్న విషయాన్ని ఆయన తెలిపారుజ. బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలో డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు డా. ఎం.శ్రీధర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పాశం యాదగిరికి ప్రదానం చేశారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యాసాగర్‌రావు యాదగిరిని ఘనంగా శాలువా, జ్ఞాపికతో సత్కరించి సాహిత్య పురస్కారంతో పాటు 25వేల రూపాయల నగదును అందించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ఉభయ తెలుగురాష్ట్రాలలో గిరిజనుల స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, వారికి చెందిన భూములు అన్యాక్రాంతమై వారు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. మహారాష్ట్ర గవర్నరుగా ఉన్నకాలంలో ఈ పరిస్థితిని నివారించడానికి రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌ను అమలు చేశానని తెలిపారు. ఆచార్య శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో 82 సంవత్సరాలుగా సారస్వత పరిషత్తు తెలుగుభాషకు చేయాల్సిన సేవలో తనవంతు పాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చివరిగా సాహిత్య పురస్కార గ్రహీత పాశం యాదగిరి పర్యావరణ న్యాయం అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. డా. విజయలక్ష్మి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్యలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# భవనంపై నుంచి దూకి గృహిణి ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్, మే 4 ప్రభాతవార్త :** ఇష్టంలేని పెళ్లి చేశారనే మనోవేదనతో ఓ నవ వధువు ఐదంతస్థుల భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పరిధిలోని సుభాష్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన హరికృష్ణకు ఆదేప్రాంతానికి చెందిన లక్ష్మి(25)తో గతసంవత్సరం డిసెంబరు 14న వివాహం జరిగింది. రెండు నెలలక్రితం లక్ష్మి తన స్వగ్రామం నుండి వచ్చి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. హరికృష్ణ ప్రైవేట్ కంపెనీలో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. లక్ష్మితోపాటు తమ్ముడు కూడా ఆమెతోపాటే ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఇష్టంలేని వివాహం చేశారనే మనోవేదనతో ఆదివారం ఉదయం నాలుగున్నర నుండి ఐదున్నర గంటల సమయంలో తాను నివసిస్తున్న భవనంపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేని జీడిమెట్ల పోలీసులు తెలపారు. సంఘటన ఉదయం నాలుగున్నర నుండి ఐదున్నర గంటల కాలంలో జరగగా సమాచారం అందిన వెంటనే జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# వాహన దొంగలు అరెస్ట్

**హైదరాబాద్, మే4, ప్రభాతవార్త:** నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయగా ఒకరు పరారిలో ఉన్నాడు. హుమాయన్‌నగర్, నార్సింగ్, కొల్లురు, శంషాబాద్ పోలీస్ స్టేషన్లలో జరిగిన ఘటనలపై ఆదివారం నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలను వెల్లడించారు. టోలిచౌకికి చెందిన మహ్మద్ నవీద్ (22), సమీ (21)లు చిన్ననాటి బాల్య స్నేహితులు. వీరు ఆటోలో వెళ్లి నార్సింగ్ పీఎస్ పరిధిలో ఒక బైక్‌ను దొంగతనం చేసి రహ్మాన్‌కు రూ.10వేలకు అమ్మగా...ఇతను స్నేహితుడు అయిన మహ్మద్‌బసీద్‌కు అదే ధరకు విక్రయించాడు. అదేవిధంగా హాకీంపేటకు చెందిన సోహేల్ (19), ప్లంబర్ పని చేస్తాడు. సొంత వాహనంపై వెళ్లి హుమాయన్‌నగర్ పీఎస్ పరిధిలో మరో బైక్‌ను తీసుకెళ్లి రూ.10వేలకు విక్రయించాడు. మరో ఘటనలో టోలిచౌకికి చెందిన షేక్‌మోహిత్ (20), మహ్మద్ మెహ్రాజ్(19), అబ్బాస్ (20)లు వేర్వేరు పనులు చేస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాన్ని ఎంచుకొని కొల్లూరు పీఎస్ పరిధిలో బైక్‌ను దొంగతనం చేసి రూ.15వేలకు అమ్మాడు. బహదూర్‌పురకు చెందిన సమద్ (23), నసీర్ (26) బావబామ్మర్ధులు. శంషాబాద్ పీఎస్ పరిధిలో ఆటోను తీసుకవెళ్లాడు. వేర్వేరు ఘటనల్లో ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాగా నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం రంగంలోకి దిగింది. నిఘా ఏర్పాటు చేసి సీసీఫుటేజీల ఆధారంగా ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మెహ్రాజ్, అబ్బాస్‌లు పరారీలో ఉండగా ఆరుగురిని అదులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ఆటోలు, అయిదు బైక్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరిని జువైనల్ హోంకు, రిమాండ్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సైలు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో నిందితులు

# పెరగనున్న మెట్రో ఛార్జీలు..!

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త**

హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలు పెరగబోతున్నాయి. మే రెండోవారం నుంచి సవరించిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెట్రో వర్గాలు పేర్కొంటున్నాయి. ఎల్ అండ్ టీ ఛైర్మన్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన వచ్చేవారం రాగానే ఛార్జీలు ఖరారు కానున్నాయి. వీటి ద్వారా వార్షికంగా అదనంగా రూ.150 కోట్ల వరకు రాబట్టుకునేలా ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కసరత్తు చేస్తోంది. మెట్రో రైలు ప్రాజెక్టు కారణంగా ఎల్ అండ్ టీ సంస్థ భారీ నష్టాలను ఎదుర్కొంటోంది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు రూ.6,500 కోట్ల నష్టం వాటిల్లినట్లు సమాచారం. స్టేషన్లు, మాల్స్‌లో రిటైల్ స్పేస్ లీజ్, ప్రకటనలతో ఆదాయ మార్గాలను మెరుగుపర్చుకోవడానికి సంస్థ నిరంతర ప్రయత్నాలు చేస్తున్నా నష్టాలు భరించలేని స్థాయికి చేరాయంటోంది. ఛార్జీల పెంపుదల కోసం ఎల్‌అండ్‌టీ గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో ఛార్జీల పెంపు తప్పేలా లేదని అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కనిష్ఠ ఛార్జీ రూ.10. గరిష్ఠంగా ఛారీలు రూ.60 ఉన్నాయి. గరిష్ఠం రూ.75 వరకు పెరిగే అవకాశం ఉందని సమాచారం. దీన్ని ఇంతవరకు పెంచాలా? ఎంత పెంచాలి? ఎప్పుడు పెంచాలి? మొదట పెంచి ఆ తర్వాత తగ్గించాలా? ఇలా పలు కోణాల్లో సంస్థ యోచిస్తోంది. ఇప్పటికే రూ.59తో ఉన్న హాలిడే సేవర్ కార్డును రద్దు చేసింది. మెట్రో కార్డుపై రద్దీవేళల్లో 10 శాతం రాయితీని ఎత్తివేసింది. మెట్రో ఆపరేషన్స్, ప్రకటనలు, మాల్స్ అద్దెల ద్వారా ఏటా రూ.1500 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. మెట్రో నిర్వహణ, బ్యాంకు రుణాలపై వడ్డీల చెల్లింపు తదితర ఖర్చులన్నీ కలిపి రూ.2 వేల వరకు వ్యయం అవుతోందని ఎల్ అండ్ టీ వర్గాలు చెబుతున్నాయి

# వృద్ధ దంపతులు దారుణ హత్య

## లక్ష నగదు, బంగారు ఆభరణాలు అపహరణ



కనకయ్య(ఫైల్ ఫొటో)

**అల్వాల్, మే 4 ప్రభాతవార్త:** సొంత ఊరిలో వ్యవసాయం చేసుకునే సత్తువ లేక పోవడం, జీవిత చరమాంకంలో కడుపున పుట్టిన బిడ్డలు వద్ద ఉండి శేష జీవితాన్ని గడిపేద్దామనుకున్న వృద్ధ దంపతులు నగరానికి చేరుకున్నారు. వాచ్‌మెన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న వారిని అనారోగ్య సమస్యలు వెంటాడాయి. నగర జీవనం తమకు సరిపడదని అనుకున్న వారు పుట్టి పెరిగిన ఊరికి వెళ్లిపోవడానికి సిద్దపడిన సమయంలో దారుణ హత్యకు గురయ్యారు. పాత కక్షలు లేదా ఆర్థిక పరమైన లావాదేవీలు కారణంగా ఘటన జరిగి ఉంటుందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అల్వాల్‌లో సంచలనంగా మారిన హత్యలకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లా ఇల్లందు మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన కనకయ్య (70), రాజమ్మ(65) దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా వీరందరికి వివాహాలు జరిగాయి. సంతానం అంతా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్నారు. వయసు పెరగడంతో ఊరిలో వ్యవసాయం చేయలేని పరిస్థితి దాపురించింది. బిడ్డలు వద్దకు వెళ్లి చిన్నా చితక పనులు చేసుకుంటూ జీవితాన్ని గడుపుదామని మూడు సంవత్సరాలు క్రితం అల్వాల్‌కు చేరుకున్నారు. కుమారుడు రాంబాబు, కూతురు లతలు నివాసం ఉంటున్న సూర్యనగర్‌కు వచ్చి కనకయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా దంపతులు ఇద్దరు అరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. సొంత ఊరికి వెళితే ఆరోగ్యం కుదుటపడుతుందనే నిర్ణయానికి ఇరువురు వచ్చారు. శనివారం రాత్రి కూతురు ఇంటికి వెళ్ళిన కనకయ్య సామాన్లు సర్దుకోవడానికి అవసరమైన సంచులను తెచ్చుకోవడం జరిగింది. ఇదిలా ఉండగా ఇటీవల ఉరికి వెళ్ళిన కనకయ్య అక్కడి నుంచి లక్ష రూపాయలు తెచ్చి స్థానికంగా వడ్డీకి ఇవ్వడానికి ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలిసిన వ్యక్తులే దారుణానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి నిద్రలో ఉన్న దంపతులను దుంగ కట్టెలతో తలపై మోది హత్య చేశారు. లక్ష నగదుతో పాటు రాజమ్మ ఒంటిపై ఉండే బంగారు ఆభరణాలు కనిపించడం లేదని కొడుకు, కూతురు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దంపతులు వద్ద నగదు ఉందనే సమాచారం బయటకు తెలిసిన నేపథ్యంలో ఘటన జరిగి ఉంటుందనే తెలుస్తోంది. డాగ్ స్క్వాడ్‌కు చెందిన జగిలం హత్య జరిగిన దగ్గరలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద కలియ తిరిగింది. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది.

బాలానగర్ డిసిపి సురేష్‌కుమార్, పేట్‌బషీర్‌బాద్ ఎసిపి రాములు, అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. హత్య మిస్టరీని చేధించేందుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామని కొన్ని ఆధారాలు లభ్యం అయ్యాయని డిసిపి తెలిపారు.

## భావితరాలకు ఆదర్శప్రాయుడు భగీరథుడు

**సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య సగ**

**నారాయణఖేడ్, మే 4 ప్రభాతవార్త :** భావితరాలకు, ప్రత్యేకంగా ఆధునిక యుగానికి ఆదర్శప్రాయుడు భగీరథుడని సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్యసగర అన్నారు. ఆదివారం సగరుల(ఉప్పర) కులదైవం భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివుని కోసం తపస్సుచేసి ఆయన మెప్పును సంపాదించి, గంగను దివి నుండి భూమిపైకి తీసుకొచ్చిన మహనీయుడు భగీరథుదన్నారు. కార్యక్రమంలో సగర సంఘం తాలూకా అధ్యక్షులు నారాయణ, నాగల్గిద్ద మండల అధ్యక్షుడు పండరీసగర, తాలూకా యువజన అధ్యక్షుడు బాలరాజ్, మానిక్ ప్రభు, పండరీ, విఠల్, గోపాల్ సగర సాయిలు,రామ్, లక్ష్మాన్, సాయిలు, నర్సింలు, విష్ణు, గోపాల్, నరేష్, ర్యాకల్ నర్సింలు ఉన్నారు.

## నేడు ఖేడ్‌కు సిపిఐ ఎమ్మెల్సీ రాక

**నారాయణఖేడ్, మే 4 ప్రభాతవార్త :** స్థానిక అతిథి బంగ్లాలో సోమవారం సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్సీ నేలకంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాదిన్ హాజరవుతున్నరని సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి, దత్తురెడ్డి అశోక్, ఉప్పల అశోక్, సతీష్ ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు

## బిజెపి మండల అధ్యక్షుడిగా శంకర్‌రావుపాటిల్

**సిర్గాపూర్, మే 4, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన వంగ్దాల్‌కు చెందిన బిరాదార్ శంకర్‌రావు పాటిల్‌ను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి 15 సంవత్సరాలుగా శక్తి వంచన లేకుండా కృషిచేస్తున్న శంకర్‌రావు పాటిల్‌కు పార్టీ న్యాయం చేసిందని పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కార్యకర్తల సహకారంతో తన వంతు కృషి చేస్తానని శంకర్‌రావు పాటిల్ హామి చేశారు.

## ఆలయంలో చంద్రశేఖర్‌రెడ్డి పూజలు



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

**మనూర్, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాపూర్ తండాలో జగదాంబ భవానీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ మూర్తి ప్రతిష్టాపన కార్యక్రమాల్లో డిసిసి ప్రధానకార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని భోగ్ బండార్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న చంద్రశేఖర్‌రెడ్డిని ఆలయ కమిటి బాధ్యులు సాదరంగా స్వాగతం పలుకగా మహారాజ్ శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు.కార్యక్రమంలో నాయకులు వెంకట్ నాయక్, మాజీ సర్పంచ్ మారుతినాయక్, కిషన్ నాయక్, మహన్‌నాయక్, చాత్ర నాయక్, దేవి సింగ్, శంకర్ నాయక్, భక్తులు తండా వాసులు పాల్గొన్నారు.

## బిబ్యానాయక్ తండాలో విగ్రహాల ప్రతిష్టాపన

**-పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాసర్ బిబ్యానాయక్ తండాలో జగదాంబ భవాని సంత్ సేవాలాల్ మహారాజ్ మూర్తి ప్రతిష్టాపన పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను గిరిజనులు ఆచార సంప్రదాయ పద్దతిలో ఘనంగా జరుపుకున్నారు. ప్రతిష్టాపన పూజలకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాభోగ్ బండార్ లో పాల్గొని మాజీ ఎమ్మెల్యే పూజలు చేపట్టారు. ప్రతిష్టాపన కార్యక్రమానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేను పోరాదేవి శేఖర్ మహారాజ్ శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు చేశారు. కార్యక్రమంలో కొండాపూర్ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, తండా భక్తులతోపాటు పరిసర తండాల నుంచి భక్తులు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## కెపిఎస్ యూనియన్‌కు మద్దతు పలకండి

**-ఏఐటీయుసీ మండల కార్యదర్శి శంకరప్ప**



మాట్లాడుతున్న శంకరప్ప

**సదాశివపేట, మే 4, ప్రభాతవార్త:** ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్ ఎన్నికల్లో కేపిఎస్ యూనియన్‌కు మద్దతుపలకాలని ఎంఆర్ఎఫ్ కార్మికులకు ఏఐటీయుసీ మండల కార్యదర్శి శంకరప్ప వినతి చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకరప్ప మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాడే కేపిఎస్ యూనియన్ తరపున బరిలో ఉంటున్న కొత్తగొల్ల శేఖర్‌కు మద్దతు పలకాలని సూచించారు. కార్మికుల హక్కుల సాధనకు కృషి చేసే కెపిఎస్ యూనియన్‌కు ప్రతి కార్మికుడు ఎన్నికల్లో మద్దతు పలకాని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ముస్తాఫా, యకూబ్ పాల్గొన్నారు.

## గ్రామ సుభిక్షానికి మైకోడ్‌లో యజ్ఞాలు

**మనూర్, మే 4, ప్రభాతవార్త:**

గ్రామ సుభిక్షాన్ని కాంకిస్తూ మండల పరిధిలోని మైకోడ్‌లో యజ్ఞాలు నిర్వహించారు. ప్రతి మాసంలో మొదటి ఆదివారం గ్రామంలో వివేకానంద సేవా సమితి ఆద్వర్యంలో యజ్ఞాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగా మే మాసంలో మొదటి ఆదివారం అయిన 4వ తారీఖున గ్రామానికి చెందిన యశ్వంత్, శంకరప్ప కుటుంబ సభ్యులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి బాధ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా శివశక్తి ఆధ్వర్యంలో గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహికంగా హనుమాన్ చాలీసాను పఠించారు.



మైకోడ్‌లో యజ్ఞాలు నిర్వహిస్తున్న భక్తులు

# ఖేడ్ డిపోకు 18 నూతన బస్సులు : ఎమ్మెల్యే



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**మనూర్, మే 4, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్ డిపో నుంచి మండల పరిధిలోని బోరంచ గ్రామం మీదుగా కంకోల్ వరకు నడిచే బస్సును ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. నారాయణఖేడ్ నుంచి బోరంచ గ్రామం వరకు ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం ఎలాగుందని అడిగి తెలుసుకున్నారు. గతంతో ఎక్కడికి వెళ్లలన్నా డబ్బులు చెల్లించాల్సి వచ్చుందని, డబ్బులు లేక అవసరం ఉన్నా ప్రయాణించే వారంకాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించి మహిళలకు ఊరట కలిగేలా చేసిందని మహిళలు ప్రభుత్వ తీరును కొనియాడారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుదూ మూడు నెలల్లో నారాయణఖేడ్ డిపోకు 18 నూతన బస్సులను తీసుకురావడంతో సఫలీకృతులయ్యామని, ప్రయాణీకులు పాట్లు పడకుండా ప్రశాంతంగా ఆర్టీసి బస్సులో ప్రయాణం చేసేలా చర్యల తీసుకుంటున్నామన్నారు. జూన్ మాసంలో మరో 10 బస్సులను ఇచ్చేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారని, ప్రయాణీకుల ప్రశాంత ప్రయాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

**నల్లపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు...**

మండల పరిధిలోని నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి అర్చకులు శ్రీకాంత్ స్వామి,సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ్‌స్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లపోచమ్మ ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని, అందుకు ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు దారం శంకర్ సేట్, మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమండ్లు, భూమయ్య, అఖిలేష్‌రెడ్డి, సంజురెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ వ్యాపార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**సిద్దిపేట రూరల్, మే 4, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గాంధీ వ్యాపార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాముని నగేష్, ఉపాధ్యక్షులుగా తిరునహరి నప్రశాంత్,అంబడిపల్లి భాస్కర్, కోశాధికారిగా చేకూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా బాశెట్టి నాగరాజు,సంయుక్త కార్యదర్శిగా, గౌరవ సలహాదారుగా పెండోట శ్రీనివాస్‌చారి, కార్యవర్గ సభ్యులుగా కొండబత్తిని కన్నయ్య, నిమ్మ కిష్టారెడ్డి, పెంటి అనంద్,.ఎం.డి.హుస్సేన్, వాజిద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మూడోసారి అధ్యక్షులుగా కాముని నాగేష్ బాధ్యతలు చేపట్టారు.

## ఘనంగా దుర్గా భవాని జాతర మహోత్సవాలు

**-పాల్గొన్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు**

**జహీరాబాద్ (కోహీర్), మే 4, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న శ్రీ దుర్గా భవాని మాత జాతర మహోత్సవాలకు మాజీ మంత్రు తన్నీరు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, చింత ప్రభాకర్, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తంలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ అమ్మవారి దయతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్దికి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటి చైర్మన్ గుండప్ప, రామకృష్ణరెడ్డి, మాజీ ఆత్మ కమిటి చైర్మన్ విజయ్‌కుమార్, మండలాల పార్టీ అధ్యక్షులు నర్సింలు, తట్టునారాయణ, వెంకటేశం, సొసైటీ చైర్మన్ స్రవంతి అరవింద్‌రెడ్డి, మాణిక్‌ప్రభుగౌడ్, విఠల్, ఆలయ కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## పెద్దాపూర్‌లో రేణుక మాత విగ్రహ ప్రతిష్టాపన

**సదాశివపేట, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దాపురంలోలో శ్రీరేణుకమాత విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు ఆదివరం భక్తి శ్రద్దలతో నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ సేవా సమితి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం కనుల పండువగా భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కళ్యాణోత్సవంలో టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలజగ్గారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు చేరుకున్న భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందచేసిన మాజీ ఎమ్మెల్యే

**కంగ్టి, మే 4, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన మండల పరిధిలోని జంబ్గి(కె) గ్రామానికి చెందిన యండి సోఫీకి 60వేలు, రసల్ గ్రామానికి చెందిన కురుమ పండరికి 21వేల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను కార్పొరేట్ ఆసుపత్రిలో మెరగైన చికిత్స అందుకునేందుకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు అంబాజీ రావు, మాజీసర్పంచ్ సాయిలు, ఉత్తంరావు, సంజుపాటిల్, బాబురావు పాల్గొన్నారు.

## నేడు బిహెచ్‌ఈఎల్ ప్లైఓవర్ ప్రారంభం

**రామచంద్రాపురం, మే 4, ప్రభాతవార్త:** రామచంద్రాపురం పట్టణ పరిధిలోని లింగంపల్లి చౌరస్తాలో నిర్మించిన బీహెచ్‌ఈఎల్ ప్లైఓవర్‌ను ఈ నెల 5వ తారీఖున కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గట్కారి ప్రారంభిస్తారు. నేషనల్ హైవే ఆర్‌అర్‌బి, హెచ్‌ఎండిఏ అధికారులు ప్లైఓవర్ ప్రాంతాన్ని మెరుగపర్చి విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా మెరుగుదిద్దారు. 138 కోట్ల రూపాయలతో 1.6 కిలో మీటర్ల మేర నిర్మించిన ప్లై ఓవర్ ప్రారంభంతో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందుకుంటారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కేంద్ర మంత్రి నితిన్ గట్కారి సాయంత్రం హెలిక్యాప్టర్ ద్వార ఇక్రిశాట్ ప్రాంగణానికి చేరుకుని అక్కడి నుంచి సాయత్రం 4 గంటలకు రోడ్డు మార్గన ప్లైఓవర్ వద్దకు చేరుకుని ప్రారంభించనున్నారు కార్యక్రమంలో కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మెదక్, చేవెళ్ల ఎంపిలు రఘునందన్‌రావు, విశ్వేశ్వరరెడ్డి, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ,ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు బిక్షపతి ఆర్థిక సహాయం

**అల్లాదుర్గం, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొల్లకుంట తండాలోని భవాని మాత విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు మఠం బిక్షపతి తన వంతుగా 25వేల రూపాయలను ఆలయ కమిటి బాధ్యులకు ఆదివారం అందచేశారు. ఆలయానికి చేరుకున్న బిక్షపతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మఠం బిక్షపతిని ఆలయ కమిటి బాధ్యులు శాలువాతో సత్కరించి మెమోంటోను అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అధ్యక్షులు ఈర్ల అనిల్‌కుమార్‌రెడ్డి, డి కాశీనాథ్, మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు పల్లెగడ్డ నరసింహులు, గొల్లకుఉంట గిరిజన తండా మాజీ సర్పంచ్ సోనీ శివరాం తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రహిత యువతను మార్చుకుందాం

**-పొగాకు జిల్లా నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి**

**మనూర్, మే 4, ప్రభాతవార్త:** పోగాకు రహిత యువతను మార్చుకోవాల్సిన అవసరం ఉందని పోగాకు జిల్లా నియంత్రణ విభాగము సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బోరంచలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో కొనసాగుతున్న జాతర ఉత్సవాలు హాజరైన భక్తులకు విష్ణువర్ధన్‌రెడ్డి పోగాకు కలిగే అవస్థలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగప్రదేశాల్లో ధుమాపానం నిషేదమని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది విల్ప, పద్మ ఎలీషా, ఎష్ఐ శంకర్, పోలీసు సిబ్బంది లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**పాల్గొన్న పద్మదేవేందర్ రెడ్డి దంపతులు**

**హవెలిఘనపూర్, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాయలంలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.అమ్మవారి చల్లని చూపు గ్రామ ప్రజల అందరిపై తప్పక ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గౌడ సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి గారిని,ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి గారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు యామి రెడ్డి, సుభాష్ రెడ్డి,కిష్టా గౌడ్,సాప శ్రీనివాస్. కాయితీ దాసు. అరిగే పోచయ్య. సాప సత్తయ్య. కల్వకుంట్ల పోచయ్య.సాప సాయిలు,కాయితి శ్రీను శ్రీనివాస్, గోండ్ల సత్తయ్య. నర్ర బాలయ్య. గొండ్ల నాగరాజు. నర నరేష్ రౌతు ప్రతాప్ . ఏసు రెడ్డి,లింగ రెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి సాప అంజయ్య గ్రామ గౌడ సంఘం నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్టలో హనుమంతరావు...**

హవెలిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాయలంలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**న్యాల్‌కల్, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హెస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు విఠల్ సతీమణ సిద్దమ్మ విద్యుత్ ఘాతంతో మృతి చెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎప్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు మున్నూర్ రవీందర్, యువ నాయకుల మిథున్‌రాజ్, దీపక్, ఉమేష్, హనీఫ్, వెంకటేశ్వర్, దిగంబర్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌పాటిల్, నగేష్‌లు గ్రామానికి చేరుకుని సిద్దమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్రక్రియల్లో పాల్గొని సిద్దమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**పటాన్‌చెరు, మే 4,ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలోగల మరనాత హీలింగ్ టెంపుల్ చర్చి సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, చర్చి నిర్వాహకులు భాస్కరరావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**హుస్నాబాద్ టౌన్,మే 4, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణంలోని సిద్దార్థ హై స్కూల్‌లో 2000-2001 సంవత్సరం విద్యార్థులు 25 వసంతాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు సురేందర్‌రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సత్యం, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ రమేష్,రాజ్‌మహ్మద్, నారాయణరెడ్డి, రాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్కన్నపేటలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**రామాయంపేట, మే 4, ప్రభాతవార్త :**

శ్రీ శ్రీ భగీరథ మహర్షి జయంతి పురస్కరించుకొని ఆదివారం నాడు రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో సగర సంఘం మరియు సగర యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సగర యువజన సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్ సగర, అక్కన్నపేట యువజన సంఘం అధ్యక్షులు వగ్గు రమేష్ సగర, కృష్ణ సగర, ఎల్లం సగర, శ్రీను సగర,వంశీ సగర, నాగులు సగర, రంజిత్ సగర, యాదగిరి సగర,బాబు సగర, వేణు సగర, సాయి సగరతో పాటు సగర సంఘం బందు మిత్రులు పాల్గొన్నారు...

## విద్యాపీఠంలో ఉచితంగా కలరి పట్టుపై శిక్షణ

**సంగారెడ్డిటౌన్, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిరావు విద్యాపీఠంలో కలరి పట్టు శిక్షణను 15 రోజుల పాటు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్దాంతి పేర్కొన్నారు. ఆదివారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మహేశ్వర సిద్దాంతి మాట్లాడుతూ ఏప్రిల్ 24న ప్రారంభమైన శిక్షణ మే 9వ తారీఖు వరకు కొనసాగుతాయన్నారు. కేరత ప్రాచీన క్రీడ అయిన కలరి పట్టు తో విద్యార్థులకు పలు ఉపయోగాలు ఉంటాయన్నారు. ఈ ప్రాంతంలోని మొదటి సారి కలరిపట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసనట్లు గుర్తు చేశారు. 131 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. సమావేశంలో విధ్యాపీఠం సభ్యులు రుక్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మే 4,ప్రభాతవార్త:**

ప్రస్తుత సమాజంలో కుల సంఘాల పాత్ర గణనీయంగా పెరిగిందని.. నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి పక్షపాతం లేకుండా సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన.. పటాన్చెరు పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలో మెజార్టీ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు సొంత నిధులను సైతం అందించడం జరిగిందని గుర్తుచేశారు.భవిష్యత్తులను వారికి అండగా నిలుస్తామని తెలిపారు. కులం అంటేనే బలమని.. వారి వారి కులాలలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారి అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆడపిల్ల పెళ్లిళ్లకు.. మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి కులంలోనూ వర్గాలు సహజమని.. అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొ ంటర్లు శంకర్‌యాదవ్, సపానదేవ్, ఆదర్శ్‌రెడ్డి, నర్రా బిక్షపతి, సంఘం నూతన అధ్యక్షులు బోజయ్య, ప్రధాన కార్యదర్శి రమేష కుమార్, ముఖ్య సలహాదారుడు నర్రా బిక్షపతి, గౌరవ అధ్యక్షుడు బుచ్చయ్య, ఉపాధ్యక్షులు నర్ర రామారావు, కాసాల యాదయ్య, నాయకులు బంటి,సుధాకర్, సంఘంసభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

## కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి

**మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి**

**అమీన్‌పూర్, మే 4 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. ఆదివారం నరేందర్‌నగర్ కాలనీలో వాసులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి రూ.50 వేల అందజేశారు. కార్యక్రమంలో మహిళలు కానివాసులు పాల్గొన్నారు.

## బీరంగూడ ఆలయాన్ని దర్శించుకున్న రిటైర్డ్ ఐఏఎస్

**అమీన్‌పూర్, మే 4 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఆదివారం రిటైర్డ్ ఐఏఎస్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారధితో పాటు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి చైర్మన్ బైసా సుధాకర్‌యాదవ్ పార్థసారధిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

**అమీన్‌పూర్, మే 4 ప్రభాతవార్త:** చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ తెలిపారు. ఆదివారం టీం ఎన్‌ఎస్‌జి సభ్యుల ఆధ్వర్యంలో బాలాజీ నగర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో ముఖ్యమని,బాటసారుల దహాన్ని తీరుస్తాయని ఆయన చెప్పుకొచ్చారు.చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఎన్.ఎస్.జి సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో లింగం గౌడ్,రవి,రాజు,గోవింద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నముబారక్‌పూర్‌లో భగీరథ జయంతి వేడుకలు

**సిర్గాపూర్, మే 4, ప్రభాతవార్త:** ఒంటికాలిపై కఠోర తపస్సు చేసి పరమ శివుడిని ప్రసన్నం చేసుకుని పవిత్రగంగను దివి నుంచి భూమికి తీసువచ్చిన మహాఋషి సూర్యవంశ సగర క్షత్రియ భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం మండల పరిధిలోని చిన్నముబారక్‌పూర్‌లో ఘనంగా జరుపుకున్నారు. భగరథ మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించి జయంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో సగర కుల బంధువులు సగర్ సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి సహకారంతో కాలనీల అభివృద్ధి : ఎమ్మెల్యే



నూతన పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 4, ప్రభాతవార్త:** సమిష్టి సహకారంతోనే కాలనీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ కాలనీలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన పార్క్‌ను కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లికార్జున్‌నగర్ కాలనీ అభివృద్ధికి తన అండదండలు ఎప్పుడు ఉంటాయన్నారు.దశాబ్ద కాలంగా అపరిష్కతంగా ఉన్న పార్కు స్థల సమస్యను పరిష్కరించి జిహెచ్‌ఎంసి నిధులతో పార్కును ఏర్పాటు చేశామన్నారు. కలనీ సంక్షేమ సంఘం భవనంలో డైనింగ్ హాల్ ఏర్పాటుకు నిధులు కేటాయిస్తానని హామి చేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, ప్రమోద్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్, బల్దియా అధికారులు సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కాంస్య విగ్రహానికి రూ.లక్ష ఆర్థిక సహాయం



నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

**మెదక్ అర్బన్, మే 4, ప్రభాతవార్త:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు లక్ష రూపాయలు ప్రకటించారు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్. ఆదివారం అంబేద్కర్ కాంస్య విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో టీఎన్జీఓల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ జెల్ల సుధాకర్, మానవ హక్కుల వేదిక నేత షేక్ అహ్మద్ కలిశారు. ఈ సందర్భంగా తన వంతు సాయంగా లక్ష రూపాయలు ప్రకటించారు. అంబేద్కర్ తాను దేవుడిలా భావిస్తానని చెప్పారు. తాను గెలిస్తే అంబేద్కర్ మూజియం ఏర్పాటు చేసి అందులో బంగారు విగ్రహం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉండేదన్నారు.

## మల్లన్నస్వామి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**కొమురవెల్లి, మే 4 ,ప్రభాతవార్త :** శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని బీసీసీఐ అండ్ హెచ్‌సిఏ క్యూరేటర్ వైఎల్ చంద్రశేఖర్ ఆదివారం కుటుంబం సమేతంగా దర్శించుకున్నారు. దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లన్న స్వామి దయతో తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఇండియా క్రికెట్ టీమ్ మరిన్ని విజయాలు సాధించి దేశానికి మంచి పేరు తేవాలన్నారు. మల్లన్న స్వామి దయంతో సన్ రైజర్స్ హైదారాబాద్ టీం ప్లే ఆఫ్‌కు చేరుకోవాలన్నారు. ఆయన వెంట దేవాలయ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, అలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్, సిద్దిపేట జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

## కేతకి ఆలయంలో చండీ హోమం

**ఝరాసంగం, మే 4, ప్రభాతవార్త:**

లోక కళ్యాణార్థం హైద్రాబాద్‌కు చెందిన శ్రీ గురు మహాసేవ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఝరాంసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. చండీ హోమాలకు హాజరైన భక్తులకు అన్నదానం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈఓ శివరుద్రప్ప, మండల కాంగెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్ నాయకులు సంగమేశ్వర్‌పాటిల్, మాలి పటేల్ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది బాలయ్య శర్మ, రామకృష్ణ, శ్రీనివాస్‌కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ముప్పిడి నవీన్

## అవినీతిపరులపై చర్యలు తీసుకోండి

**బేగంపేట మే 4, ప్రభాతవార్త :** ఏళ్లతరబడి పాతుకుపోయి అవినీతిని ప్రోత్సహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ కోరారు. ఈ మేరకు నవీన్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి అవినీతికి పాల్పడుతున్న సిబ్బంది, అధికారులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసామన్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్లలో అవినీతికి పాల్పడుతున్న అధికారులు సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. బేగంపేట పరిధిలోని బేగంపేట, రాంగోపాల్‌పేట మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని సీతాఫల్‌మండీ, బౌద్ధనగర్, మెట్టుగూడా, తార్నాక డివిజన్‌లలో జీహెచ్ఎంసీ అనుమతికి మించి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదని తెలిపారు. కింది స్థాయిలో జరుగుతున్న విషయాలను సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియకుండా కప్పిపుచ్చుతూ అందినమేరకు దండుకుంటూ జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసికెళ్లాన న్నారు. ఈ విషయంపై వారం రోజుల్లో విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టనున్నట్లు కమీషనర్ హామీ ఇచ్చినట్లు ముప్పిడి తెలియజేసారు.

## జ్ఞానంతోనే ఏదైన సాధించవచ్చు

### టిటిపిఎ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్‌రావు



శ్రీలంకలో జరిగిన ఇంటర్‌నేషనల్ స్టడి టూర్‌లో పాల్గొన్న ప్రతినిధులు

**సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త:** జ్ఞాన సమపార్జనకు స్టడి టూర్లు ఎంతగానో దోహదపడతాయని తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ (టిటిపిఎ) రాష్ట్ర అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు చెప్పారు. గత నెల 28 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు శ్రీలంకలో టిటిపిఎ నిర్వహించిన ఇంటర్‌నేషనల్ స్టడి టూర్ ఘనంగా ముగిసిందన్నారు. ఈ టూర్లో ఎన్నో కొత్త విషయాల నేర్చుకున్నామని చెప్పారు. ప్రతి మనిషికి జ్ఞానం ఎంతో ముఖ్యమని జ్ఞానం ద్వారానే ఏదైనా సాధించవచ్చునని, జ్ఞానం లేకపోతే మనిషి ఎందుకు పనికిరాడని తెలిపారు. స్టడి టూర్‌లో కె.హుస్సేన్‌వల్లి, కె.వి.రమణమూర్తి, బి.దుర్గాప్రసాదరావు, జి.నాగరాజు, ఎస్.రామారావు, ఎ.రమేష్‌బాబు, షేక్ అజాద్, టి.వి.సుబ్బారావు, వై.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సంజీవని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం..


విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

**కొంపల్లి, మే 4, ప్రభాతవార్త :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరిలో ఆదివారం నిర్వహించిన సంజీవని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయువును, ఆరోగ్యాన్ని పెంపొందించే సంజీవని ఆంజనేయస్వామి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కిరణ్, చింతల దేవేందర్, లక్ష్మణ్, జీవన్ రెడ్డి, జయభేరి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు గిరిబాబు, వాసుదేవ రెడ్డి, సాగర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, మన్మోహన్ పాండే, శేఖర్, సీతారామ రాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహిళా కాంగ్రెస్ కృషి


మాట్లాడుతున్న ఖైరతాబాద్‌జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందని ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీశ్రీకాంత్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం నిర్వహించిన ఖైరతాబాద్ జిల్లా బూత్ లెవెల్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ మరియు రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావుల ఆదేశాల మేరకు ఖైరతాబాద్ జిల్లాలో బూత్ స్థాయి కమిటీలను నిర్వహించేందుకు నాంపల్లి కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఫిరోజ్‌ఖాన్‌ను, కార్వాన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఉస్మాన్ భాయ్‌ని కలవటం జరిగిందని తెలిపారు. రాహుల్‌గాంధీ మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని, అందులో భాగంగానే రాబోయే స్థానిక ఎన్నికలలో బూతు లెవెల్ కమిటీలలో మహిళలకు స్థానం కల్పించాలని ఆదేశించారని పేర్కొన్నారు. పార్టీ అధిష్టాన ప్రోత్సాహంతో మహిళా కాంగ్రెస్ మరింత ఉత్సాహంగా పనిచేసి, పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.

## రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

**మెహదీపట్నం, మే 4, ప్రభాతవార్త :** కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ లోని శ్రీ పంచముఖ బ్రహ్మ దేవాలయంలో మంగళవారం నుండి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు విశ్వకర్మ సేవా సంఘం అధ్యక్షులు నరహరిచారి తెలిపారు. ఆరాధన మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం దేవాలయంలో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నామని రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల భాస్కర్, సలహాదారులు ఆర్.ప్రేమచారి, ట్రెజరర్‌లు ఆర్.రమేష్‌చారి, అనంతచారి ఆవిష్కరించారు. అనంతరం సి.నరహరిచారి ఆరాధన మహోత్సవాల వివరాలను వెల్లడించారు. ఈ మహోత్సవాలు మూడురోజులపాటు భక్తిశ్రద్ధలతో జరుగుతాయని తెలిపారు. మంగళవారం మొదటిరోజు కలశపూజ, గణేశపూజ, అంకురార్పణం, ధ్వజారోహణం, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అష్టోత్తర శతనామావళి సహిత హృదయ పుష్పాంజలి, కళ్యాణం, ప్రసాద వితరణ, ఊరేగింపు, రెండవ రోజు బుధవారం నిత్యపూజలు, శ్రీస్వామివారి ఆరాధన, మహా నైవేద్యం, భజన, మూడవరోజు గురువారం నిత్యపూజలు, చక్రతీర్థము, శ్రీస్వామివారి పల్లకి సేవకార్యక్రమాలను పురోహితులు పట్నాల సాయి ప్రశాంత్ ఆచార్యులు సి.వెంకటేష్ తెలిపారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌తో మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు

**కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త :** కాలనీలోని సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని సుందర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఇటీవల నూతనంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నూతన కమిటీ సభ్యులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక అభివృద్ధిపనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకొని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నూతన అధ్యక్షుడు అమర్నాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, ఉపాధ్యక్షురాలు మాలిని మాజీ అధ్యక్షుడు మాచారావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, ఏసీపీ జయపాల్‌రెడ్డిల

## పార్సిగుట్ట చోరీ కేసును చేధించిన పోలీసులు

### మేన కోడలే అసలు సూత్రధారి.. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

**సికింద్రాబాద్, మే 4 ప్రభాతవార్త :** ఇల్లు అద్దెకు కావాలంటూ రెండు రోజుల కిందట ఇంట్లోకి చొరబడి జరిగిన దొంగతనం కేసును వారాసిగూడ పోలీసులు చేధించారు. ఆదివారం సాయంత్రం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం పార్సిగుట్టలో పారిజాతం(60) అనే మహిళ ఒంటరిగా అద్దెకు ఉంటోంది. ఆమె ఉంటున్న భవనంలోనే మరో గది ఖాళీగా ఉండటంతో ఇంటిముందు టు లెట్ బోర్డు పెట్టారు. ఈనెల 2న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇద్దరు ఆగంతకులు ఇల్లు అద్దెకు కావాలని లోనికి వచ్చారు. ఈ గది కాదని సమాదానం చెప్పేలోపే పారిజాతంను కుర్చీలో కట్టేసి, నోటికి బ్యాండేజి వేసి కత్తులతో బెదిరించి మూడు తులాల బంగారం నగలు, ఒక మొబైల్ ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదుచేసుకున్న వారాసిగూడ పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పార్సిగుట్ట సంజీవపురంలోని ఎస్ఆర్ హాస్పిటల్ సమీపంలో ఉండే భాస్కర్ భార్య ఎల్ల జ్యోతి(45), మూషీరాబాద్ రాజ్‌డిలక్స్ సినిమా థియేటర్ వాసవి ఆర్యవైశ్య హాస్టల్ సమీపంలో ఉండే దశరథ కుమారుడు ఎలగరి శ్రీకాంత్(26), మూషీరాబాద్ బన్సీలాల్‌పేట్ పొట్టి శ్రీరామ్‌నగర్‌కు చెందిన కె. దశరథ కుమారుడు కొర్రోలు ఈశ్వర్(19)లు నిందితులుగా తేల్చారు. వీరిని ఆదివారం అదుపులోనికి తీసుకొని అరెస్ట్ చేశారు. పారిజాతం మేనకోడలు జ్యోతి తనకు పరిచయం ఉన్న శ్రీకాంత్‌కు తన మేనత్త ఒక్కరే ఇంటిలో ఉంటారని, వెళ్లి బంగారు నగలు చోరి చేయమని స్కెచ్ వేసింది. శ్రీకాంత్, తన ఫ్రెండ్ ఈశ్వర్‌ను తీసుకొని వెళ్లి ఈ చోరికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అసలు సూత్రధారి జ్యోతితో పాటు శ్రీకాంత్, ఈశ్వర్‌లను పట్టుకున్న పోలీసులు వారి వద్ద నుంచి చోరి చేసిన 3 తులాల బంగారు నగలు, ఒక మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో చోరి కేసును చేధించి, చోరి సొత్తును రికవరీ చేసిన ఏసీపీ జైపాల్ రెడ్డి, సీఐ రమేష్ గౌడ్, ఎస్ఐలు సుధాకర్, ప్రకాశ్ రెడ్డి, క్రైమ్ కానిస్టేబుల్స్ ఎండీ గాలెబ్, ఎమ్డీ దస్తగిరి, ఎస్.వేణు, బి.రామకృష్ణ తదితరులను డీసీపీ బాలస్వామి అభినందించి, రివార్డులను అందచేశారు.

## ఎస్‌బీఐ భవనంలో భారీ అగ్ని ప్రమాదం....

### మూడు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చే యత్నం...

**బేగంపేట మే 4,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ లోని ఎస్‌బీఐ భవనంలో ఆదివారం సాయంత్రం సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది.ప్యాట్నీ సెంటర్ లో ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అడ్మినిస్ట్రేషన్ భవనంలోని నాలుగవ అంతస్తులో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి.ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి,పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది 4 ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.అయితే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.భవనంలోని నాలుగో అంతస్తులో పూర్తిగా మంటలు వ్యాపించాయి.దీంతో ఈ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది.అయితే ఆదివారం కావడం సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.అయితే ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు మాత్రం కొంత ఇబ్బందులకు గురయ్యారు.బ్యాంకు అధికారులు అక్కడికి చేరుకున్నారు.మంటలు అదుపులోకి వచ్చిన తర్వాతే జరిగిన నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


దగ్ధమవుతున్న ఎస్బీఐ బ్యాంకు

### నృత్యాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయి

**చిక్కడపల్లి, మే 4 ప్రభాతవార్త:** నృత్యాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధినేత విక్కి మాస్టర్‌నిర్వహణలో టిఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ, అంతర్జాతీయ నాట్య దినోత్సవం పురస్కరించుకుని కె శ్రీనివాస్‌రావు, కాంచన సుధా రమ్య అనురాధ శిష్య బృందం కూచిపూడి నృత్య అంశాల ప్రదర్శన జరిగింది. అదిగో అల్లదిగో శ్రీ హరి వాసము, అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నారు. . సంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ, చౌహాన్ రవీంద్రసింగ్ పునీత్ అతిథులుగా పాల్గొన్నారు సంస్థ అధ్యక్షులు విక్కి మాస్టర్ పర్యవేక్షణలో నాట్య గురువులకు ఐకాన్ అవార్డ్ లు బహుకరించారు.


**PUBLIC NOTICE**

It is informed to the general public that my client **Sri. Merugu Rajalingam** S/o. Sri Shiva lingam has informed that he had misplaced the **Original Registered Sale Deed (Link Documents) No.3680/2009,** dated: 05-12-2009 executed by Sri. T V Rama Rao in favour of Sri. Merugu Shiva Lingam S/O. Sri M Rajalingam at SRO, Kapra of the below mentioned Schedule of Property. I further declared at I have lost above said property on 16-04-2025 at while I going home to xerox center at ECIL X Road's for getting xerox copies in the middle area my documents cover have been misplaced. If anybody found the above Document same may be intimated/hand over the same to the below mentioned address. If any person has any claim/interest/ dispute over the said transaction, the same may be intimated to the undersigned within 7 (seven) days from the date of this publication, failing which, no further claims/objections will be entertained and my clients will proceed with the same.

**SCHEDULE OF PROPERTY**

All that the Piece and Parcel of the Open Plot bearing admeasuring area 160 Square Yards or equivalent to 133.76 Square Meters, in Survey No. 159,161 to 169, Situated at Weaver's Colony, Bhavana Nagar, under Kapra Municipality and Mandal, R.R District, and bounded by: North: Plot No 124/G, South: Plot No 125, East: 125/H Road, West: 33' Wide Road.

**S. Siva Kumar**
**Advocates**
137/301, 3st Floor,
Sri Sai Residency,
Vijayapuri Colony,
Kapra-500062.
**Ph : 8520043333**



**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE-CUM-XIV ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT : AT : HAYATHNAGAR**
**O.S.NO. 314 OF 2025**

Between:
1. **Smt. Shekapuram Sharada** W/o. Late Shekapuram Seetaram
2. **Shekapuram Chandra Shekar** S/o. Late Shekapuram Seetaram
3. **Shekapuram Srinivasulu** S/o. Late Shekapuram Seetaram
4. **Gayatri Rechintala** W/o. R.Naveen Kumar ...Plaintiffs

AND

**The Tahsildar,** Hayathnagar Revenue Mandal, Ranga Reddy District & another ...Defendants

To
**ALL CONCERNED (Defendant No.2)**
**NOTICE**

Please take notice that the above named plaintiffs have filed above suit for declaration to declare the plaintiffs as Legal Heirs and successors to succeed his estate of **Late Shekapuram Seetaram S/o. Shekapuram Veerappa** who died intestate on **03.11.2009** in respect of the suit schedule property i.e All that the Open Plot bearing Plot No.99, in Sy.No.18, admeasuring 200 Sq.yards or equivalent to 167.28 Sq.Mtrs situated at Hayathanagar Khalsa Village, Hayathangar Revenue Mandal, Ranga Reddy District, Telangana State and bounded by : NORTH: Plot No.98, EAST: Plot No.96, SOUTH: Plot No.100, WEST: 30 ft wide Road and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on **13.06.2025 at 10.30 AM,** either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
**M. DEVENDER REDDY**
**Advocate**
Flat No.306, Raghavendra Heavens Road No.1, Telephone Colony, Kothapet, Hyderabad-500 102.
**Cell No. 9440036699**


## పిల్లల ఆటవిడుపుకు, పెద్దల మానసిక ప్రశాంతతకు

## పార్కులు దోహదం : ఎమ్మెల్యే, ఎంపీ

**జీడిమెట్ల, మే 4, ప్రభాతవార్త :** 125 గాజుల రామారం డివిజన్ మహాదేవపురంలో 90 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహదేవపురం పార్కును ఆదివారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆటవిడుపుకు, పెద్దలకు మానసిక ప్రశాంతతకు చేకూర్చడంలో పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని, పార్కులను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, ఆంజనేయులు, రాములుగౌడ్, వహీద్, దూలప్ప, బోయిని మహేష్, శివ నాయక్, ప్రసాద్, మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, రంగా రావు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రామచంద్ర రెడ్డి, ప్రవీణ్ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**అల్వాల్, మే 4 ప్రభాతవార్త:** వెంకటాపురంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎండలు ఎన్నడూ లేని విధంగా వేడిని పుట్టిస్తున్న సమయంలో పార్టీ పరంగా ఆయా ప్రాంతాలులో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వాహనదారులు పాదచారులు దాహార్తిని తీర్చడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబిటి చైర్మన్ నందికంటి శ్రీధర్ కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ నేతలు శ్రీనివాసులు, డోలి రమేష్, పవన్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన కూడలిలో సుందరీకరణ పనులు

అల్వాల్, మే 4 ప్రభాతవార్త: స్వచ్ఛ సర్వేక్షన్‌లో బాగంగా ప్రధాన కూడలిలో సుందరీకరణ పనులను జిహెచ్ఎంసి పారిశుధ్య శాఖ చేపట్టింది. బహిరంగ ప్రదేశాలులో ప్రజలు చెత్తను వేయడం ఇకనైనా మానుకోవాలని సిబ్బంది సూచించారు. వ్యర్థాలు ఉంటున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ మొక్కలు నాటడంతో పాటుగా ప్రజలులో మార్పు వచ్చే విధంగా సుందరమైన చిత్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఎఫ్ఎ వెంకటేష్ తెలిపారు. తమ ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## ఘనంగా క్రికెట్ టోర్నమెంట్

**సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'క్రికెట్ ఖేలో-నషా ఛోడో' అనే నినాదంతో 'నో డ్రగ్స్-నో బెట్టింగ్స్' అంటూ ఎల్‌బి స్టేడియంలో గత నెల 27వ తేదీ నుంచి నేటి వరకు కొనసాగిన టి20 ఛాంపియన్ షిప్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా కొనసాగింది. టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బిసి ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, శివచరణ్‌రెడ్డి పాల్గొని ప్రథమ బహుమతి కింద 5లక్షల 55,555 రూపాయలు, ద్వితీయ బహుమతి కింది 3 లక్షల 33,333 రూపాయలను ప్రదానం చేశారు. అలాగే బెస్ట్ ప్లేయిర్‌కి ఎలక్ట్రిక్ స్కూటి, బెస్ట్ బౌలర్‌కు స్మార్ట్ టివి, ఇతర ప్లేయిర్‌లకు కూడా వారు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్, జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ అనే మహమ్మారి, బెట్టింగ్ బారిన నేటి యువత పడకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనిచేస్తున్నదని చెప్పారు. ఆదే స్ఫూర్తితో రాష్ట్ర యువజన కాంగ్రెస్ తరపున నేటి యువతను చేడు వ్యసనాలకు బానిసలుగా కాకుండా బంగారు భవిష్యత్తు కోసం యువజన కాంగ్రెస్ కృషి చేస్తున్నదని వారు చెప్పారు.

### ఘనంగా కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రతిష్ట మహోత్సవం

**అల్వాల్, మే 4 ప్రభాతవార్త:** అల్వాల్ సాయి సూర్య ఎన్‌క్లేవ్‌లో సపరివార కన్యకా పరమేశ్వరీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానం ప్రతిష్టోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది.ఐదు రోజులు పాటు విశిష్ట పూజలు ద్వారా ఆలయ ప్రతిష్టోత్సవం జరగనున్నది. ప్రతి రోజు చతుర్వేద పారాయమణంతో పాటు వేద పండితులు శాస్త్రోక్తకంగా ప్రతిష్టకు సంబంధించిన క్రతువును నిర్వహిస్తారని ఆలయ ప్రతినిధులు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### ఓ నాయకుడు నిర్వాకంతో ఆగిన

## క్రీడామైదానాభివృద్ధి : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యూ బోయిన్పల్లి ప్లే గ్రౌండ్‌లో నెల రోజులపాటు జరిగే వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ కబ్జాదారుల నుంచి స్థలం స్వాధీనం చేసుకొని అందరి సహకారంతో క్రీడామైదానంగా అభివృద్ధిచేశామని, 1999 నుండి ప్రతిఏడు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని చెప్పారు. మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం స్థలం కూడా ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడి క్రీడామైదానముగా అభివృద్ధి చేశామన్నారు. అజిత్ రెడ్డి సీఈఓగా కొనసాగిన సమయంలో బోయిన్పల్లి ప్లే గ్రౌండ్ అభివృద్ధికి 45 లక్షల రూపాయలు విడుదలజేయగా ఓ బోర్డు సభ్యుడు అడ్డుకుని క్రీడా మైదానమ్ అభివృద్ధి జరగకుండా క్రీడాకారులకు అన్యాయము చేసాడని అన్నారు. బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ మాట్లాడుతూ తాను చిన్నతనంలో బోయిన్పల్లి మైదానంలో పలు క్రీడల్లో శిక్షణ పొందానని తన వంతుగా క్రీడలకు క్రీడాకారులకు అండగా ఉంటానని హామీచ్చారు .నెల రోజులపాటు వాలిబాల్.ఫుట్బాల్. క్రికెట్. బాక్సింగ్. షటిల్. కబడ్డీ. రెజ్లింగ్.రగ్బీ. అథ్లెటిక్స్‌లో శిక్షణ అందజేస్తున్నట్లు స్పోర్ట్స్ అస్సోసిషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుకుమార్ గౌడ్. జైరాజ్. మునిరాజ్. జగదీష్. సత్యనారాయణ.రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్ బండి శ్రీనివాస్. యాదగిరి. కుమార్. మధు. వాసు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

**కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 2.25 లక్షల రూపాయల పత్రాన్ని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. అమీర్‌పేట డివిజన్ లోని బాపూనగర్‌కు చెందిన కల్లీ బాయి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం మంజూరైంది. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో లబ్ధిదారురాలి కుమారుడికి తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, సంతోష్ మణి కుమార్, గోపిలాల్ చౌహాన్, హరిసింగ్, కూతురు నర్సింహ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి

**మెహదీపట్నం, మే 4, ప్రభాతవార్త :** భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఆదివారం మెహిదీపట్నం భోజగుట్ట సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు, గుడిమల్కాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ నాగారం వేణుగౌడ్ పాల్గొని భగీరథమహర్షి చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివి నుంచి భూమికి గంగను తీసుకొచ్చిన తపస్వీ, పట్టుదలకు పరాక్రమానికి నిలువెత్తు రూపం భగీరథ మహర్షి అని కొనియాడారు. కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షులు కట్టెల నరసింహ సాగర్, శేఖర్ సాగర్, మల్లేష్ సాగర్, అంజి, కృష్ణ, రాజు, రాము, హరికృష్ణ, నగేష్, మహేందర్, శీను, అశోక్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమాజం పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలి

### నాగులూరి సాయిబాబా

**సికింద్రాబాద్, మే 4 ప్రభాతవార్త :** ప్రతి మనిషి ఆస్తులను కూడబెట్టుకోవడమే కాకుండా ఆస్తులను సంపాదించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, సామాజిక సేవవేత్త నాగులూరి సాయిబాబా అన్నారు. నాగులూరి సాయిబాబా సేవలను గుర్తించి, మేడే ఉత్సవాలను పురస్కరించుకొని దళిత సంఘర్షణ సమిమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరుడు కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నాగులూరి సాయిబాబాను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఆస్తులను ఎవరైనా సంపాదించగలుగుతారని, కాని ఆప్తులను సంపాదించడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆపదలో ఉన్న వారిని నిత్యం ఆదుకుంటు, విద్యా, వైద్యానికి ఉపయోగపడే విధంగా సహాయ, సహకారాలు అందించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కుప్ప శ్రీనివాస్ గౌడ్ ఇతర నేతలు పాల్గొన్నారు.


**ఫారమ్ నం. URC-2**

**పార్ట్ I, అధ్యాయం XXI క్రింద నమోదు గురించి ప్రకటన**

**(2013 కంపెనీల చట్టంలోని విభాగం 374(b) మరియు 2014 కంపెనీలు (నమోదుకు అధీకృతం) నియమాలు 4(1) నియమం ప్రకారం)**

1. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366లోని సబ్-సెక్షన్ (2) ప్రకారం, తెలంగాణలోని రిజిస్ట్రార్‌కు ఒక దరఖాస్తు చేసుకున్నట్లు దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది. PEOPLE MEDIA FACTORY LLP కంపెనీల చట్టం 2013లోని XXI అధ్యాయం యొక్క పార్ట్ I క్రింద, షేర్ల ద్వారా లిమిటెడ్ కంపెనీగా నమోదు చేయబడవచ్చు.
2. **కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:** "నాటకాలు, నాట్యాలు, హాస్య నాటకాలు, ఒపేరాలు, ఒపెరెట్టాలు, బర్లెస్క్‌లు, సినిమాలు, ప్రసారాలు, సంగీత కార్యక్రమాలు, పాటలు, బొమ్మల ప్రదర్శనలు, బాలే, వినోద కార్యక్రమాలు మరియు ప్రదర్శనలను ప్రదర్శించేందుకు, ప్రోత్సహించేందుకు, నిర్వహించేందుకు, అందించేందుకు, నిర్వహించేందుకు మరియు నిర్మించేందుకు. విద్య మరియు కళల అభివృద్ధి, ప్రమోషన్, నిర్వహణ మరియు మెరుగుదలకు మద్దతు ఇవ్వటం. సినిమాలు, టెలివిజన్ సీరియల్స్, మోషన్ పిక్చర్స్, ఫీచర్ ఫిలిమ్స్, ప్రకటనలు, వీడియో ఫిల్మ్స్, మ్యూజిక్ వీడియోలు, ఆడియో ఆల్బమ్స్ ఉత్పత్తి, పంపిణీ, ప్రదర్శన, మార్కెటింగ్ మరియు ఏజెన్సీ ప్రాతినిధ్యంలో పాల్గొనడం. వినోద పరిశ్రమ కోసం కంటెంట్‌ను రూపొందించడం మరియు పంపిణీ చేయడం మరియు వ్యాపారం నిర్వహణకు అవసరమైన సంబంధిత లేదా అనుబంధ కార్యకలాపాలను నిర్వహించడం".
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క ముసాయిదా స్మృతిపత్రం మరియు అసోసియేషన్ ఆర్టికల్స్‌ను 8-2-293/82/L/303-A, రోడ్ నెం. 12, ఎమ్మెల్యే కాలనీ, బంజారాహిల్స్, హైదరాబాద్, ఖైరతాబాద్, తెలంగాణ, ఇండియా-500034 అనే కార్యాలయంలో పరిశీలించవచ్చు.
4. ఈ దరఖాస్తుపై ఎవరైనా అభ్యంతరం ఉన్నవారు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఇరవై ఒక రోజుల్లోగా అభ్యంతరాన్ని Central Registration Center (CRC), Indian Institute of Corporate Affairs (IICA), ప్లాట్ నెం. 6, 7, 8 మరియు 5, IMT మానేసర్, పిన్ కోడ్ - 122050 వద్ద రిజిస్ట్రార్‌కు మరియు కంపెనీ నమోదు కార్యాలయానికి పంపవలెను.

ఈ ప్రకటన తేదీ: 03-05-2025

అభ్యర్థుల పేర్లు:
1. విశ్వ ప్రసాద్ తుంబలంగూటి
2. సుబ్రమణ్య వివేకానంద కుచిభొట్ల



**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, AT: RED HILLS, HYDERABAD.**
**A.B.R. C.F. NO. 37 OF 2024**

Between :
**KAPIL CHITS (HYD) PVT. LTD.**
DIAMONDPOINT, FDPT01J-22 ...DISPUTANT

AND

**Ms. SULOCHANA KASIREDDY, & Others ...OPPONENT**

To,
1. **Ms. SULOCHANA KASIREDDY,** W/o. K Damodaram Reddy, aged about 62years, Occ: Finance Manager Emp Id: 0105019 Clinical Software Pvt Ltd Yousufguda Hyderabad Telangana, R/o. H NO-1-1-380/39A, ASHOKNAGAR EXTEN, NEAR SUB REG OFFICE ASHOK NAGAR, HYDERABAD,TELANGANA.
2. **SRAVANTHI DUGGEMPUDI,** w/o CHINNABBAIAH D, aged about 33 years, Occ: Seniorsoftware Engineer Emp.Code.122206 Parexel Intrenational India Pvt Ltd. SEZ Madhapur Hyderabad Telangana., R/o. H.N.1-1-380/39 B, ASHOK NAGAR, HYDERABAD, HYDERABAD,TELANGANA.
3. **DAMODARAM REDDY KASI REDDY,** s/o NARASIMHA REDDY K, aged about 62 years, Occ: Senior Asst.Mp. No.00336306 SBI Hrms dept.Main Branch Hyderabad Telangana., R/o. H.N.1-1-380/39 A, ASHOK NAGAR, NEAR SUB REGISTER OFFICE, Ashoknanar, HYDERABAD, TELANGANA.
4. **SAI KRISHNA REDDY KASI REDDY,** s/o DAMODARAM REDDY K, aged about 33 years, Occ: Java Team Lead Emp No br020 Bracket Technology Private Ltd . Hitech City Madhapur Hyderabad Telangana, R/o. H.N.1-1-380/39 B, ASHOK NAGAR, HYDERABAD, HYDERABAD,TELANGANA.
5. **MOUNIKA YERRA BANDI,** w/o SRINIVASA REDDY Y, aged about 29 years, Occ: Java Developer Emp No Br071 Bracket Technology Private Ltd high Tech City Madhapur Hyderabad Telangana, R/o. H.N.1-1-380/39 C, ASHOK NAGAR, HYDERABAD, HYDERABAD,TELANGANA.

Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs.10,773/-** You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **13-05-2025 at 11:00 AM** failing which the matter will be decided exparte in accordance with law.

By order of the court.
**J. Srinivas Reddy**
**ADVOCATES**
**HYDERABAD.**



**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, AT: RED HILLS, HYDERABAD.**
**A.B.R. C.F. NO. 529 OF 2024**

Between :
**KAPIL CHITS (HYD) PVT. LTD.**
SECUNDERABAD, FMGT02F-35 **...DISPUTANT**

AND

**Ms. P. PADMA RAO, & Others ...OPPONENT**

To,
1. **PADMA RAO P,** S/o. Prasad Rao, aged about 66years, Occ: Business, R/o. PLOT NO.101, THIYA APARTMENT OPP. ST PAULS SCHOO, BOWENPALLY, HYD,TELANGANA. PAVANI PALURI, W/o. NARESH BASKE, aged about 43 years, Occ: Staff Nurse Emp Code. 1464833 Primary Health Centre Government Of Telanagan Health Department Phc Srirangavaram Medchal Dist, R/o. H.NO. 9-4-39/A/A, LION TOWN COLONY HAMSATHPET, BOWENPALLY, HYDERABAD,TELANGANA.
2. **VEERAYYA MANGALAPATI,** S/o. DANIEL M, aged about 61 years, Occ: Section Officer Emp Code. 2602038 GOVT OF ANDHRA PRADESH Panchayat Raj And Rural Deptartment, R/o. H.NO.4-41/A/2, LION TOWN COLONY HASMATHPET, THIRUMALGIRI MANOVIKAS NAGAR, HYDERABAD,TELANGANA.
3. **JATINDER PAL SINGH,** S/O. HARBHAJAN SINGH, aged about 35 years, Occ: Quality Specialist Emp Code. 001160531 DEPARTMENT OF IND TRANSACTION QUALITY OPTUM Optum Global Solutions Ind Pvt Ltd hitech city madhapur Hyderabad, R/o. H.NO. 218, SUKAYA ROAD NO.10, EAST SINGBHUM GOLMURI, JHARKHAND,JHARKHAND.
4. **VIJAYASHYAMALA M,** W/o. PADMA RAO P, aged about 72 years, Occ: Head Nurse Gandhi Hopital Secunderabad, R/o. H.NO.101, CRISTIYANA APT 1 FLOOR, OLD BOWENPALLY, Hyderabad, TELANGANA.

Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs.3,589/-** You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **13-05-2025 at 11:00 AM** failing which the matter will be decided exparte in accordance with law.

By order of the court.
**J. Srinivas Reddy**
**ADVOCATES**
**HYDERABAD.**



**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, AT: RED HILLS, HYDERABAD.**
**A.B.R. C.F. NO. 530 OF 2024**

Between :
**KAPIL CHITS (HYD) PVT. LTD.**
SECUNDERABAD, FMGT02J-16 **...DISPUTANT**

AND

**Ms. PRASAD IALV, & Others ...OPPONENT**

To,
1. **PRASAD IALV,** I.V. Seshagiri Rao, aged about: 58years, Occ: Accounts Assistant Emp No.24101127226 Department Of Accounts South Central Railway Secunderabad, R/o. FLAT NO.106, ROYALASCOT, Padmarao Nagar Secunderabad, HYD, TELANGANA.
2. **RAGHURAM DEVULEPALLI,** s/o SUBBA RAO D, aged about 58 years, Occ: SR.SO A EMP NO.24201121870 DEPARTMENT OF ACCOUNTS SOUTH CENTRAL RAILWAY SECUNDERABAD, R/o. H.NO.2-3-337, SAI RAM NAGAR, NAGOLE, HYD,TELANGANA.
3. **SUBRAHMANYA SARMA OGIRALA,** s/o. ANJANEYA SASTRY O, aged about 56 years, Occ: SR.SO A EMP NO.24101121868 DEPARTMENT OF ACCOUNTS SOUTH CENTRAL RAILWAY SECUNDERABAD, R/o. H.NO.7-84/70, MAYURI NAGAR, DAMMAIGUDA, HYD,TELANGANA.
4. **KUMAR SADALA,** s/o. SHYAM KUMAR S, aged about 55 years, Occ: ACCOUNTS ASSISTANT EMP NO.24101127123 DEPARTMENT OF ACCOUNTS SOUTH CENTRAL RAILWAY SECUNDERABAD, R/o. H.NO.10-386/11, SRI TIRUMALA RESIDENCY PVN COLONY, MALKAJGIRI, HYD, TELANGANA.

Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs.2,260/-** You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **13-05-2025 at 11:00 AM** failing which the matter will be decided exparte in accordance with law.

By order of the court.
**J. Srinivas Reddy**
**ADVOCATES**
**HYDERABAD.**

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్



**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే4** : షాద్‌నగర్ పట్టణంలోని గంజ్‌లో కాంగ్రెస్ పార్టీ 20వ వార్డు నాయకుడు మన్నె జానకి రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జి, చలివేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చలివేంద్రం నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, సీనియర్ నాయకులు అగ్గనూరు బస్వం, జమృద్‌ఖాన్, కొమ్ము కృష్ణ, నర్సింహులు, ప్రదీప్ మరోటియా, భరత్ లోహటి, వాసు, మనీష్, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎంఈఓ మనోహార్**

**షాద్‌నగర్‌రూరల్, మే4, ప్రభాతవార్త** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఫరూఖ్‌నగర్ మండల ఎంఈఓ మనోహార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5వ తేది నుంచి 19వ తేది వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని, ఈ క్యాంపులలో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడాలు, తదితర కోర్సులు నేర్పించడం జరుగుతుందన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్, వెలిజర్ల ప్రాథమి ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మండల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శారీరకంగా, మానసింగా ధృడం కావాలని ఆయన తెలిపారు.

## బిఆర్ఎస్ నాయకుడు మురళీకృష్ణ యాదవ్ జన్మదిన వేడుకలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే4** : బీఆర్ఎస్ యువ నాయకుడు వై.మురళీకృష్ణ యాదవ్ జన్మదిన వేడులకను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ బచ్చలి నరసింహ్మా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యుగంధర్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, చిన్నయాదగిరి, నందిగామ శ్రీనివాస్, కొండ మల్లేష్, సుశాంత్, పిట్టల మల్లేష్, పిల్లి సాయి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

**సంవిధాన్ అభియాన్**

## ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

**- కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.డి.ఇబ్రహీం.**

**షాద్‌నగర్ రూరల్, మే4, ప్రభాత వార్త** : జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎం.డి.ఇబ్రహీం అన్నారు. ఆదివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే నేటి నుంచి కేశంపేట మండలంలో సంవిధాన్ అభియాన్ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటగా కొనయపల్లి సంతాపూర్ గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నాట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమ ముఖ్యఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు: ఎస్ఐ యాదగిరి



**దుద్యాల్, మే 4, ప్రభాతవార్త:** రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దని దుద్యాల ఎస్సై యాదగిరి రైతులకు సూచించారు. ధాన్యం ఆరబెట్టడానికి రైతులు కష్టాలు పడుతున్నారని,అలాఅని రోడ్లపైధాన్యంఆరబెట్టడం వల్ల రాత్రిపూట నల్లని తార్పాలిన్ కవర్లు కప్పి ఉంచడం వలన వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాలు,చనిపోయే ప్రమాదం ఉందని అన్నారు. రైతులు తమ స్వలాభం కొరకు రోడ్లపై ధాన్యం ఆరబోసి వాహనదారులకు, వారి కుటుంబాలకు తీవ్ర నష్టం జరిగే విధంగా చేయవద్దని కోరారు. పొలాల పక్కన ఉన్న ఖాళీ స్థలాల ం చదు ం చేసుకుని ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు.

## బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**దుద్యాల్, మే 4, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల పరిధిలోని దుద్యాల్ – లింగంపల్లి వెళ్లే ప్రధాన రహదారి నుండి రక్త మైసమ్మ తండాకు వెళ్లే సుమారు 1.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ ప నులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ లు శంకుస్థాపన చేశారు. రూ.1.62 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ ప నులు చేపడుతున్నట్లు తెలిపారు. ప నులలో నాణ్యత పాటించాలని, రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం గౌడ్, ఖాజ, కృష్ణయ్య, సత్యనారాయణ, ఖలీల్ పాషా, ముజీబ్, పాకాల రాములు, హర్యానాయక్, నరేష్, వెంకటయ్య ం పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

**ధారూరు, మే4, ప్రభాతవార్త:** కొ నుగోలు కేంద్రాల ం రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాంపూర్, గట్టేపల్లి, గ్రామాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొ నుగోలు కేంద్రాల ం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు కొ నుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారుల ం నమ్మిమోసపోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ హరిదాస్పల్లి చైర్మన్ రాం రెడ్డి ,సీనియర్ నాయకులు బుజ్జయ్య గౌడ్,బాబా ఖాన్,వైస్ చైర్మ ్ల, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జైపాల్ ,వాణిశ్రీ ,శోభ మాణిక్యం ,ప్రతాప్,శమిమ్‌పాష,సాయన్న,మాజీప్రజాప్రతినిధులు రాజేందర్, పాండు నాయక్ ,రమేష్ కృష్ణ , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను పెంపొదించుకోవాలి

**ఘట్‌కేసర్, మే4, ప్రభాతవార్త:** విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాలతో వారిలో సృజనాత్మకత పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉపాధి పొందడానికి ఉపయోగపడుతాయని తెలంగాణ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగువర్షిణి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని తెలంగాణసాంఘిక సంక్షేమ గురుకుల లలితకళల పాఠశాలలో జరుగుతున్న వేసవి శిబిరాన్ని ఆమె ఆదివారం సందర్శించారు. ప్రిన్సిపాల్ ఆమెకు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న విభాగాల నుంచి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. గురుకులాల కార్యదర్శి అలుగు వరి ్షణి విచ్చేసి ప్రదర్శనను తిలకించి విద్యారు ్థలతో మాట్లాడారు. విద్యార్థులు వేసిన ఆమె చిత్రలేఖన ం పోటోను ఆమెకు బహుకరించారు ఈకార్యక్రమంలో సంస్థ ఆర్థిక కార్యదర్శి కిరణ ్మయి, సంయుక్త కార్యదర్శులు సంతోష, గీత, సక్రునాయక్, శారద, రజిని, భీమయ్య, నిర్మల, విద్యారాణి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, రాము

# ఉచితంగా ప్రభుత్వ కళాశాలకు సామాగ్రి అందజేసిన దాత

**తలకొండపల్లి మే4,ప్రభాత వార్త** :తలకొండపల్లి ప్రభుత్వ కళాశాలకు సాయం చేయాలనే ఉద్దేశంతో అడిగిన వెంటనే సామగ్రి అందించడం అభినందనీయమని కళాశాల అడ్మిషన్ డ్రైవ్,ఇన్చార్జి లైబ్రేరియన్ జి.షణ్ముఖరెడ్డి అన్నారు. కాన్వెంట్ విద్యకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో గుణాత్మక విద్యనందిస్తున్నారనీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కు ఆఫీసులో కూర్చోవడానికి ప్రిన్సిపాల్ టేబుల్ మరియు ఇతర సామాగ్రిని అడగడంతో వెంటనే గ్రామం,మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన నల్లబోల్ సుమన్ రెడ్డి గారిని సాయం కోరడంతో తక్షణమే స్పందించి రూ.30,000 రూపాయల విలువ గల సామాగ్రి కళాశాల అడ్మిషన్ డ్రైవ్,ఇన్చార్జి లైబ్రేరియన్ జి.షణ్ముఖరెడ్డి కి అందజయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అడ్మిషన్ డ్రైవ్,ఇన్చార్జి లైబ్రేరియన్ జి.షణ్ముఖరెడ్డి మాట్లాడుతూ నల్లబోల్ సుమన్ రెడ్డి ని వారి సేవలను గుర్తు చేసుకుంటూ సమాజంలో మరిన్ని సేవా కార్యక్రమాలు ముందు ముందు మరెన్నో సమాజ సేవలు చేయాలని, నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు, జీవితంలో అందరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. మీ సేవలు అభినందనీయం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశారని తెలిపారు.



కళాశాలకు ఉచితంగా ఫర్నీచర్ అందజేసిన నల్లబోయిన సుమన్ రెడ్డి

# బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల నిబద్ధతపై విస్తృత ప్రచారం

**నవాబుపేట ఎప్రిల్ 4,ప్రభాతవార్త** :భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల బిజెపి నిబ్ధతపై ఆ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు ఆయన పట్ల వ్యవహరించిన తీరును ఎండగడుతూ బిజెపి చేసిన కార్యక్రమాలను ఏకరువు పెడుతూ దళిత మేధావులను, నాయకులను కలిసి వారు చేసిన కార్యక్రమాలను వివరుస్తూ బిజెపి అంబేద్కర్ ఇజానికి వ్యతిరేకం కాదని చెప్పకనే చెబుతున్న తీరు కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా పార్టీ నాయకులు ప్రజా క్షేత్రంలో దళితులను కలిసి ముచ్చటిస్తున్న దృశ్యాలు కపిస్తున్నాయి. వారు ఇదివరకు ఆయా పార్టీలు అంబేద్కర్ పట్ల వ్యవహరించిన తీరును బిజెపి చేసిన కార్యక్రమాలను విరిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోది అంబేద్కర్ ఆశయాలకు ప్రధాన్యతనిస్తూఅంబేద్కర్ జీవితానికి సంబంధించిన ప్రదేశాలను కోట్లాది రూపాయల వెచ్చించి పంచతీర్థాలుగా అభివృద్ధి చేశామని, వాటిని చారిత్రక సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిద్దినట్లు చెబుతున్నారు. భీమ్ యాప్‌ను కూడా పిఎం ప్రారంభించారని తెతిపారు. గణతంత్ర దినోత్సవ శకటం కూడా ఏర్పాటు చేసి నిబద్ధతను చాటామని వివరిస్తూన్నారు. 2015 సెప్టెంబర్ 30 న అంబేద్కర్ స్మారక పోస్టల్ సాంప్‌ను విడుదల చేశామని తెలిపారు. ఆయన ఆలోచన విధానాలను గౌరవించి సాధికారత, సామాజిక న్యాంపై ఆయన చేసిన పోరాటానికి గుర్తుగా మోది ప్రభుత్వం అంబేద్కర్ నేషనల్ మెమోరియల్‌ను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.

అంబేద్కర్ స్ఫూర్తిగా కీలక చట్ట సవరనలు చేశామని పౌరసత్వ సవరన చట్టం (2019) ఈ చట్టం ద్వారా తూర్పు పాకిస్తాన్ ( ఇప్పటిబంగ్లాదేశ్) నుండి వచ్చిన దళిత శరణార్థులకు ఉపశమనం కల్పించామని వివరించారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా నారీశక్తి వందన అధినియం చట్టాన్ని తీసుకువచ్చి సాధికారత, సమానత్వమనే అంబేద్కర్ లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. వెనకబడిన వర్గాలకు మంత్రివర్గ స్థాయి ప్రాతినిధ్యం కోసం 27 మంది ఒబిసి మంత్రులకు చోటుకల్పించామని చెబుతున్నారు. 2015 లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జరుపుకునేందకు మోది నాయకత్వంలో నవంబర్ 26 తేదినా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకునే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భారత న్యాయ వ్యవస్థను రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన అంబేద్కర్ సేవలకు గుర్తింపుగా సుప్రీంకోర్టుతో పాటు న్యాయ మంత్రిత్వ శాఖలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయించి నిబద్ధత చాటుకున్నామని తెలిపారు. 1952లో అప్పటి ప్రధాన మంత్రి ప్రత్యక్ష పర్యావేక్షణలో మరో పార్టీతో కలిసి అంబేద్కర్‌ను ఓడించేందుకు యత్నించిందని వారు ఆరోపణలు చేశారు. అదేవిధంగా రాజ్యాంగ సభకు ఎన్నిక నాటి అధికార పార్టీ కుట్రలు చేసిందని వివరించారు. నాడు అంబేద్కర్‌కు జరిగిన అవమానాలు, నేడు బిజెపి చేస్తున్న కార్యక్రమాలను దళిత మేధావులకు, నాయకులకు వివరిస్తూ దళితులను మచ్చిక చేసుకునేందుకు పార్టీ యత్నిస్తున్నదని పరిశీలకులు భావిస్తున్నారు. కాలం ఏ నిర్ణయిస్తుందో వేచి చూడాలి.



మండల కేంద్రంలో దళితులతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

# జనగణనతో పాటు కులగణన చారిత్రాత్మకం



**ఘట్‌కేసర్, మే 4, ప్రభాతవార్త:** జనగణనతో పాటు కులగణన చేయాలని ప్రధానమంత్రినరేంద్రమోడీచారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం హర్షదాయకమని బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, ఓబీసీ మోర్చ రాష్ట్రప్రధానకార్యదర్శి నందనం దివాకర్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఫ్లెక్సీకి బిజెపి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షులు బసవ రాజుగౌడ్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మోడీకి క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహ ం ఆవరణలో నినాదాలు చేస్తూ జనగణన, కులగణనకు నిర్ణయం తీసుకోవడం పట్లమోడీకి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. నతో పాటు కులగణన ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు-మాజీ ఎంపిటిసి కొమ్మిడి శోభారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అచ్చిని నర్సింహ్మా, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు మహేందర్‌యాదవ్, బిజెపి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, పోచారం మున్సిపల్ అధ్యక్షులు సురేశ్‌నాయక్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగళ్ల మహేశ్, రాష్ట్ర నాయకులు గుండ్ల అంజనేయులు, కాలేరు రామోజీ, ఎదుగని శ్రీరాములు,మాజీజిల్లా ఉపాధ్యక్షులుకంభంలక్ష్మారెడ్డి, గుండ్లబాల్ రాజ్,పల్లె మధుసూదన్‌గౌడ్, యువమోర్చ జిల్లా అధ్యక్షులు పవన్‌రెడ్డి ,నాయకులు కొమ్మిడిదామోదర్‌రెడ్డి, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, బండ్లగూడెం కిషోర్‌కుమార్‌గౌడ్, చెల్లక శ్రీధర్, సత్యనారాయణ, గాయరు రాజు, మన్యం, అనిల్‌గౌడ్, సాయిరాం, భాస్కర్‌గౌడ్, కట్ట మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్, మహిళా మోర్చ నాయకురాలు మమతశర్మ, రేఖసోని పాల్గొన్నారు.

# విద్యుత్తు సరఫరాలేక ఇబ్బంది పడుతున్న రైతులు

**పూడూరు, మే 4, ప్రభాతవార్త** : ఆ గ్రామానికి చెందిన వ్యవసాయ బావులకు ఐదు రోజులుగా త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా లేదు.దీంతో త్రాగు,సాగు నీటి కటకట ఏర్పడింది.ఈ విషయాన్ని పలుమార్లు సంబందిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.ఇది ఎక్కడోకాదు.వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రానికి సుమారు నాల్గు కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడికొండ గ్రామానికి చెందిన వ్యవసాయ రైతుల సమస్య.గత ఐదు రోజులకింద గాలివానకు గ్రామానికి చెందిన పంటపొలాకు సరఫరా అయ్యే లెవెన్‌కెవి విద్యుత్తు వైరు తెగిపడింది.ఈ విషయాన్ని గ్రామానికి చెందిన పలువురు విద్యుత్తుశాఖ అధికారులకు విన్నవించారు.అయితే అధికార యంత్రాంగంనుండి స్పందనరాకపోవడంతో గత ఐదురోజులుగా 8 వ్యవసాయ క్షేత్రాలతోపాటు,ఈ ప్రాంత రైతులకు కనీసం సింగిల్ ఫేజ్ కరెంట్ సరఫరాకూడా లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.దీంతో త్రాగునీటితోపాటు సాగునీటి సమస్య ఏర్పడి పొలాల్లోని పంటలు ఎండుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆరోపించారు.ఈ విషయంపై ఫోన్‌ద్వారా విద్యుత్తుశాఖ డిఇకి సమాచారం ఇస్తే స్పందించలేదని,ఎఇకి విన్నవిస్తే గ్రామానికి చెందిన ప్రధాన రహదారి ప్రక్కల ఉన్న చెట్లను గ్రామస్తులు తొలగిస్తే విద్యుత్తు సరఫరా చేసేందుకు సులువుగా ఉంటుందని ఉచిత సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన చెందారు.దీంతో చేసేదేమిలేక తామే రోడ్డు పక్కల ఉన్న విద్యుత్తు స్తంభాల వైర్లను తాకే చెట్లను గత రెండురోజులుగా నరికివేస్తున్నట్లు మేడికొండ గ్రామానికి చెందిన రైతులు మేకలకాడినర్సిలు, ఎల్లయ్య,సత్యయ్య,ఇబ్రాహీం,తదితరులు తెలిపారు. సంబందిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పంట పొలాలకు విద్యుత సరఫరా చేసి సాగునీటి సమస్యను తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు.



రోడ్డు ప్రక్కన స్తంభాలకింద ఉన్న చెట్లను తొలగిస్తున్న రైతులు

# రైతు ముంగిట్లో అన్నదాతలకు శాస్త్రవేత్తల అవగాహన

**,,మాడ్గుల,మే4,ప్రభాతవార్త:-**

రైతు ముంగిట్లోనే శాస్త్రవేత్తలు ఉండనున్నట్లు మాడ్గుల వ్యవసాయ అధికారి అరుణకుమారి అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్‌వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలునేరుగా రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించడానికి వ్యవసాయ శాఖ సంయుక్త సహకారంతో ఈ నెల ఐదో తేదీ నుండి జూన్ నెల 13వ తేదీ వరకు ఆమనగల్ డివిజన్ పరిధి లోని ఆయా రైతు వేదికల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మరియు ఇన్చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు డి అరుణకుమారి తెలిపారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వానాకాలం ప్రారంభంలోనే రైతులకు వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త మరియు ప్రొఫెసర్ల బృందం మరియు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోని రైతులకు వ్యవసాయంలో వస్తున్నటువంటి నూతన సాంకేతిక అంశాలను అవగాహన పరచడంతో పాటు అధిక దిగుబడులను ఇచ్చేటువంటి నూతన వంగడాలు మరియు రకాల పై శిక్షణతో పాటుగా ముఖ్యంగా యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగు నీటి వినియోగం పై అవగాహన, పంటల మార్పిడి, చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల గూర్చి విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 7వ తేదీన మాడుగుల రైతు వేదికలో కడ్తాల్ మండలంలోని కర్కల్ పహాడ్‌గ్రామం మండలం నందు రైతులకు అవగాహన కార్యక్ర మాలు మొదలవుతున్నాయి ఈ కార్యక్రమానికి ఆమనగల్ డివిజన్ పరిధిలోగల రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని వ్యవసాయ సాంకేతిక అంశాలపై విస్తృత అవగాహన పెంచుకోవాలని రైతులకు సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం ఆయా గ్రామాల్లో ఉన్న రైతు వేదికలు, గ్రామపంచాయతీ కార్యాలయాల కు విచ్చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఈవ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## ఘనంగా ఎంపీ అరుణమ్మ జన్మదిన వేడుకలు

**ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే 4** : మహబూబ్‌నగర్ ఎంపీ డీకె అరుణ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అదేవిధంగా ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలోని చైతన్య వృద్ధాశ్రమంలో వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, కొందుర్గు మండల శాఖ అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, చౌదరిగూడ మండల శాఖ అధ్యక్షుడు ఎదిర రాజు, చేగు సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిద్దె గనేష్, రంగన్న గౌడ్, కుడుముల బాల్‌రాజ్, ఆంజనేయులు, అనిల్‌కుమార్ గౌడ్, శ్రీరామ్ రెడ్డి, కడవత్ రాజు, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వెలిజర్లలో వడగళ్లు, గాలులతో వరిపంట నేలమట్టం

**నష్టపరిహారం చెల్లించాలని రైతుల వినతి**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే4** : ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల చేతికి వచ్చిన వరి పంట పూర్తిగా నేలమట్టమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి, ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించాలని కోరారు. గ్రామానికి చెందిన రైతు దొడ్డల రాములమ్మ తనకున్న మూడున్నర ఎకరాలలో లక్షా యాభైవేల రూపాయల పెట్టుబడితో వరి సాగు చేశానని, పంట చేతికి వచ్చే సమయంలో గాలి, వడగండ్ల వర్షంతో పూర్తిగా నాశనమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టంతో తనకు భారీగా ఆర్థిక నష్టం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రభావిత ప్రాంతాలను సర్వే చేసి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చౌడాపూర్ మే4 ప్రభాతవార్త** : చౌడాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004 2005లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అంజయ్య, రమేష్, వెంకట్ రెడ్డి, సంగీత, వీరేశం, కృష్ణయ్య, సందీప్,శ్రీశైలం,శ్రీనివాస్ రెడ్డి,మల్లికార్జున్, శశిదర్,తదితరులు మాట్లాడుతూ, అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. 20 ఏళ్ళ తరువాత కూడా తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు.భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**కేశంపేట మే 4 ప్రభాతవార్త** : సీఎం సహాయనిధి పేద ప్రజల పాలిట వరం లాంటిదని అన్నారు షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్. కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన బండ వెంకటమ్మకు మంజూరైన 33 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అతని కుమారుడు శివతేజకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.పార్టీ అధ్యక్షుడు కొత్త శ్రీశైలం,ఉపాధ్యక్షుడుఖాజాపాషా, నాయకులు దిద్దెలజంగయ్య, దిద్దెలముత్యాలు,బడక్క మల్లయ్య, రాజేందర్,రామకృష్ణ, బద్దు నాయక్, కోడూరు రాములు పాల్గొన్నారు.

## అవకతవకలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పూడూరు,మే4,ప్రభాతవార్త** : ఉపాధిహామీ పథకంలో అవకతవకలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల సమాచార హక్కుచట్టం సభ్యులు చాకలి గోపాల్ పూడూరు ఎంపిడిఓకు పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన 99 సర్వే నెంబరులో మాల పోచమ్మ,మైసోల్ల శాంతమ్మ,మైసోల్ల సంతోష తదితరుల పేరున పట్టా పాసుపుస్తకాలు ఉన్నాయి కాని భూమిలేదని వివరించారు.అయితే ఇట్టి భూమిలో గత 10 సంవత్సరాలుగా ఎపిఓ,పంచాయతీ కార్యదర్శి,ఫీల్డు అసిస్టెంటు,కొందరు గ్రామస్తులతో కలిసి ఉపాధిహామీ పథకంలో పని చేసినట్లుగా రికార్డులు సృష్టించి ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు.ఉపాధిహామీ పథకంలో అవినీతి జరిగిందనడానికి సాక్షంగా తనవద్ద ఉన్న కొన్ని అధికారిక రికార్డులను పిర్యాదు పత్రానికి జతపరిచానని వివరించారు.గ్రామంలోని ఉపాధిహామీ పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యతీసుకోవాలని ఆయన కోరారు.

## భక్తిశ్రద్ధలతో ఆలయ విగ్రహ ప్రతిష్టాపన...



**కొత్తూర్,మార్చి4, ప్రభాతవార్త** :భక్తుల విశ్వాసానికి న్యాయంగా బీరప్పస్వామి ఆలయం. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయం విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా పలు పూజాకార్యక్రమాలు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎమ్మె సత్యనారాయణ పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తూర్ మండలంలోని ఎస్‌బిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకామరాతి దేవి సమేత బీరప్ప స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా ఆదివారం పలు పూజ కార్యక్రమాలు పుట్ట బంగారం తెచ్చుట, వోడ్కాలగ్నం, దేవుని కొట్నం, బోనాల ఊరేగింపు, బీరప్ప స్వామి కామరాతిదేవి ఒగ్గు కథ లాంటి పూజా కార్యక్రమాలు అతి ప్రభావంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ., మీరు ప్రత్యేకంగా బీరప్ప స్వామికి నమ్మకంతో పూజలు చేశారు. బీరప్ప స్వామి భక్తుల జీవితాల్లో శాంతి సమృద్ధిని తీసుకొస్తారని విశ్వాసం ఆలయం గ్రామానికి ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీలత, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.